

కొండంత భక్తి

విశాఖలోని పాతపోస్టాఫీస్ సమీపంలో గల రోజ్‌హిల్‌పై విశాఖపురి మేరీమాత (కొండగుడి) ఉత్సవం సోమవారం ఘనంగా జరిగింది. విశాఖ అగ్రపీఠాధిపతి ఉడుమల బాల, చర్చి ఫాదర్ల ప్రార్థనల అనంతరం వేకువజామున 4 గంటల తరువాత భక్తులను కొండపైకి అనుమతించారు. వేలాదిగా తరలివచ్చిన విశ్వాసకులు అమలోద్భవి (మేరీమాత)ని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

- వివరాలు...8లో...



మేరీమాత ఉత్సవంలో పాల్గొన్న విశ్వాసకులతో కిక్కిరిసిన కొండగుడి

ఆర్టీసీ ఆదాయం అదుర్స్

'స్త్రీ శక్తి' పథకంతో గణనీయంగా పెరిగిన రాబడి

అనకాపల్లి, నర్సీపట్నం డిపోలకు గత నెలుగు నెలల్లో రూ.33.07 కోట్ల ఆదాయం

- ఇందులో 'స్త్రీ శక్తి' ఆదాయం రూ.20.62 కోట్లు
- క్రమేపీ పెరుగుతున్న ఓఆర్
- ఉచిత ప్రయాణానికి ముందు 65 శాతం
- ఇప్పుడు 110 శాతం ఓఆర్

నర్సీపట్నం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): **స్త్రీ శక్తి పథకం అమలు తరువాత ఆర్టీసీకి ఆదాయం భారీగా పెరిగింది. ఆర్టీసీ బస్సుల్లో ఓఆర్ గణనీయంగా శాతం పెరిగింది. మహిళలకు ఉచిత బస్సు సదుపాయం కల్పించకముందు 65 శాతం ఓఆర్ వచ్చేది. ఇప్పుడు 110 శాతం ఓఆర్ వస్తున్నది. స్త్రీ శక్తి పథకం అమల్లోకి వచ్చిన నాటి నుంచి గత నెల 25వ తేదీ వరకు జిల్లాలోని అనకాపల్లి, నర్సీపట్నం డిపోలకు వచ్చిన మొత్తం ఆదాయంలో ఆరవై శాతానికిపైగా మహిళల ప్రయాణం ద్వారా రావడం విశేషం.**

ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం కల్పిస్తామని ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని కూటమి ప్రభుత్వం ఈ ఏడాది ఆగస్టు 15వ తేదీ నుంచి అమలు చేస్తున్న విషయం తెలిసిందే. పల్లెవెలుగు, అల్ట్రా పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్, సిటీ ఆర్డినరీ, మెట్రో ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో రాష్ట్ర వ్యాప్తంగా ఎక్కడి నుంచి ఎక్కడికైనా ఉచితంగా ప్రయాణం చేయవచ్చు. ఈ పథకం అమల్లోకి వచ్చిన నాటి నుంచి బస్సుల్లో మహిళా ప్రయాణికుల సంఖ్య గణనీయంగా పెరిగింది. తీర్థాలకు, పండుగలకు, వివాహాది శుభ కార్యాలయాలకు, తీర్థయాత్రలకు మహిళలు మూకుమ్మడిగా ప్రయాణం అవుతున్నారు. స్త్రీ శక్తి పథకం అమల్లోకి రాక ముందు ఓఆర్ 65 శాతం వుండగా, ఆ తరువాత నుంచి క్రమంగా పెరుగుతూ ప్రస్తుతం 110 శాతానికి చేరింది.

క్రమంగా పెరుగుతున్న ఓఆర్

జిల్లాలో నర్సీపట్నం, అనకాపల్లి డిపోల నుంచి ఆపరేట్ చేసే బస్సుల్లో జూలై 26వ తేదీ నుంచి ఆగస్టు 25 తేదీ వరకు సగటు ఓఆర్ 82 శాతం వుంది. తరువత ఆగస్టు 26 నుంచి సెప్టెంబరు 25 వరకు 98 శాతం, సెప్టెంబరు 26 నుంచి అక్టోబరు 25 వరకు 110 శాతం, అక్టోబరు 26 నుంచి నవంబరు 26 వరకు 110 శాతం ఓఆర్ నమోదైంది. స్త్రీ శక్తి పథకానికి ముందు సాధారణ రోజుల్లో ఓఆర్ 60 నుంచి 65 శాతం ఉండేది. సంక్రాంతి, దసరా పండగల సమయంలో మరో 10 శాతం పెరిగేది. అటువంటిది ఉచిత ప్రయాణ పథకం అమల్లోకి వచ్చిన తరువాత గత రెండు నెలల్లో 110 శాతం ఓఆర్ నమోదు కావడం విశేషం.



ఆర్టీసీ బస్సులో కిక్కిరిసిన ప్రయాణికులు

మూడింట రెండు వంతులు మహిళలే!

స్త్రీ శక్తి పథకం అమల్లోకి వచ్చిన తరువాత ఉచిత ఆర్టీసీ సర్వీసుల్లో ప్రయాణించే మహిళల సంఖ్య గణనీయంగా పెరుగుతున్నది. జూలై 26 నుంచి ఆగస్టు 25వ తేదీ వరకు ఆయా బస్సుల్లో 11,87,749 మంది ప్రయాణించగా, వీరిలో టికెట్టు తీసుకొని ప్రయాణించిన వారు 5,17,304 మంది, ఉచితంగా ప్రయాణించిన వారు 6,70,445 మంది ఉన్నారు. ఈ నెల రోజుల్లో పది రోజులు మాత్రమే ఉచిత ప్రయాణం అమల్లో వుంది. ఇక ఆగస్టు 26 నుంచి సెప్టెంబరు 25 వరకు 25,40,555 మంది ప్రయాణించగా వీరిలో స్త్రీశక్తి పథకం లబ్ధిదారులు 16,99,298 మంది వుండగా, టికెట్ కొనుగోలు చేసిన వారు 8,41,257 మంది మాత్రమే ఉన్నారు. సెప్టెంబరు 26 నుంచి అక్టోబరు 25 వరకు ఇంచుమించు ఇంతే సంఖ్యలో ప్రయాణం చేశారు. అక్టోబరు 26 నుంచి నవంబరు 25 వరకు 27,54,184 మంది ప్రయాణించగా వీరిలో స్త్రీశక్తి పథకం లబ్ధిదారులు 19,38,669 మంది, టికెట్టు తీసుకొని ప్రయాణం చేసిన వారు 8,15,515 మంది ఉన్నారు. మొత్తం నాలుగు నెలల వ్యవధిలో నర్సీపట్నం, అనకాపల్లి డిపోలకు చెందిన బస్సుల్లో 90,37,044 మంది ప్రయాణించగా వీరిలో స్త్రీ శక్తి లబ్ధిదారులు 60,17,533 మంది వున్నారు.

పెరిగిన ఆదాయం

స్త్రీ శక్తి పథకం అమలులోకి వచ్చిన తర్వాత ఆర్టీసీ ఆదాయం గణనీయంగా పెరిగింది. జూలై 26 నుంచి నవంబరు 25వ తేదీ వరకు రెండో డిపోలకు రూ.33.07 కోట్ల ఆదాయం రాగా, ఇందులో స్త్రీ శక్తి పథకం జీరో టికెట్ల ఆదాయం రూ.20.62 కోట్లు, ఇతర ప్రయాణికుల ద్వారా వచ్చిన ఆదాయం రూ.12.44 కోట్లు ఉంది. మహిళల ప్రయాణానికి సంబంధించిన టికెట్ డబ్బులను ప్రభుత్వం ఆర్టీసీకి రీయింబర్స్ చేసే సంస్థ కచ్చితంగా లభాలబాటలో నడుస్తుందని ఉద్యోగులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

ఎల్లయ్య కాలువకు మోక్షం

- పూడిక తీత, గ్రోయిన్ హెడ్‌వర్క్ పనులకు రూ.1.19 కోట్లు మంజూరు
- డీఎంఎఫ్ నుంచి కేటాయించిన కలెక్టర్
- నేడో రేపో టెండర్ ఖరారు
- వెంటనే పనులు ప్రారంభిస్తామని అధికారులు వెల్లడి



అనకాపల్లి పట్టణం పరిధిలో జీవీఎంసీ అధికారులు పూడిక తీయించిన ఎల్లయ్య కాలువ



తుమ్మపాల వద్ద శిథిలావస్థకు చేరిన ఎల్లయ్య కాలువ గ్రోయిన్

అనకాపల్లి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అనకాపల్లి, చోడవరం అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో శారదా నదిపై ఉన్న గ్రోయిన్ల మరమ్మతులు, పంట కాలువల్లో పూడిక తీత పనులకు కలెక్టర్ విజయకృష్ణన్ డీఎంఎఫ్ నుంచి నిధులు కేటాయిస్తున్నారు. ఇప్పటికే రూ.1.37 మంజూరు చేసి పంట కాలువల్లో పూడికలు తీయించగా, ఇప్పుడు ఎల్లయ్య కాలువ పనులకు రూ.1.19 కోట్లు మంజూరు చేశారు.

తుమ్మపాల నుంచి అనకాపల్లి పట్టణం మీదుగా మునగపాక వరకు వెళ్లే సుమారు 16.4 కిలోమీటర్ల మేర పొడవు ప్రధాన కాలువ, పిల్ల కాలువలు వున్నాయి. ఇందులో సుమారు 4.5 కిలోమీటర్ల మేర అనకాపల్లి పట్టణ పరిధిలో వున్న ఎల్లయ్య కాలువలో పూడికతీత, చెత్తాచెదారాల తొలగింపు పనులు ఇప్పటికే జీవీఎంసీ పూర్తి చేసింది. మిగిలిన 11.9 కిలోమీటర్ల పొడవున కాలువల్లో పూడిక తీత, గ్రోయిన్ హెడ్ వర్క్స్ పనులు చేపడతారు. వైసీపీ హయాంలో ఎల్లయ్య కాలువ నిర్వహణకు నోచుకోలేదు. దీంతో అనకాపల్లి పట్టణ శివారులోని ఆవఖండం ప్రాంతం, మునగపాక మండలం ఉమ్మలాడ, నాగులాపల్లి గ్రామాల్లో ఆయకట్టుకు నీరు అందని పరిస్థితి నెలకొంది. పట్టణ ... మిగతా 8వ పేజీలో



రావికమతం డీసీసీబీ బ్రాంచి వద్ద ఆందోళన చేస్తున్న సహకార ఉద్యోగులు

సహకార ఉద్యోగుల పోరుబాట

- డిమాండ్ల సాధనకు డీసీసీబీ శాఖల ఎదుట ఆందోళన

(ఆంధ్రజ్యోతి- న్యూస్‌నెట్ వర్క్)

కోర్కెల సాధన, సమస్యల పరిష్కారం కోసం సహకార ఉద్యోగులు సోమవారం జిల్లా కేంద్ర సహకార బ్యాంకు శాఖల వద్ద ఆందోళనలు నిర్వహించారు. పదవీ విరమణ వయస్సును 62 ఏళ్లకు పెంచాలని, ఐదేళ్లకో సారి వేతన సవరణ అమలు చేయాలని, ఈలోగా మధ్యంతర భృతి ప్రకటించాలని, గ్రాట్యుటీ సీలింగ్‌ను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. రూ.5 లక్షలకు తక్కువ కాకుండా ఆరోగ్య బీమా సదుపాయం కల్పించాలని, రైతులకు సంబంధించి అన్ని రకాల సేవలను సహకార సంఘాల ద్వారా నిర్వహించాలని కోరారు. 16న సహకార కార్యాలయాల వద్ద, 22 డీసీసీబీ వద్ద ఆందోళనలు చేయనున్నట్టు తెలిపారు. అప్పటికీ ప్రభుత్వం స్పందించకపోతే 29న విజయవాడలో మహాధర్నా నిర్వహిస్తామన్నారు. అనంతరం అధికారులకు వినతిపత్రాలు అందించారు.

నిన్న కుక్కలు.. నేడు కోతులు

సంక్షేమ వసతిగృహాల్లోకి జంతువుల చొరబాటు

- యథేచ్ఛగా బాలికలపై దాడి.. పలువురికి తీవ్రగాయాలు

విద్యార్థినులకు కొరవడిన రక్షణ

రావికమతం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): **సంక్షేమ శాఖలకు చెందిన బాలికల వసతిగృహాల్లో విద్యార్థినులకు రక్షణ లేకుండా పోయింది. కొద్ది రోజుల క్రితం రాత్రిపూట వీధి కుక్కలు బీసీ బాలికల హాస్టల్‌లోకి చొరబడి ఏకంగా 25 మందిని కరిచాయి. తాజాగా సాంఘిక సంక్షేమ శాఖ వసతిగృహంలోకి కోతులు వచ్చి దాడి చేయడంతో ఇద్దరు విద్యార్థినులు గాయపడ్డారు. వీరిని చికిత్స నిమిత్తం నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి తరలించారు.**

రావికమతంలోని సాంఘిక సంక్షేమ శాఖ వసతిగృహంలో 96 మంది విద్యార్థినులు వుంటున్నారు. వసతిగృహం చుట్టూ ప్రహరీ గోడ వున్నప్పటికీ ఆదివారం రాత్రి 11 గంటల ప్రాంతంలో కోతులు గోడ దూకి లోపలికి వచ్చాయి. ఈ సమయంలో బాలికలంతా నిద్రిస్తున్నారు. కోతులు గదుల్లోకి వచ్చి ఏడో తరగతి చదువుతున్న పాల్లిక స్నేహ (12), తొమ్మిదో తరగతి చదువుతున్న సీదరి మంగ (13)లపై దాడిచేసి శరీరంపై పలుచోట్ల కరిచాయి. వార్డెన్ సోమవారం ఉదయం వీరిని రావికమతం సీహెచ్‌సీకి తీసుకెళ్లి ప్రథమ చికిత్స చేయించారు. అనంతరం నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి తరలించారు. అక్కడ మెరుగైన వైద్యం చేయించిన తరువాత బాలికలను తల్లిదండ్రులకు అప్పగించి ... మిగతా 8వ పేజీలో





కోతుల దాడిలో గాయపడిన విద్యార్థినులు స్నేహ, మంగ

టెన్త్ హాల్‌టికెట్లపై క్యూఆర్ కోడ్

- స్కాన్ చేస్తే.. పరీక్షా కేంద్రానికి మార్గం
- జిల్లాలో 107 పరీక్షా కేంద్రాలు
- 21 వేల మందికిపైగా విద్యార్థులు
- పరీక్షల అసిస్టెంట్ కంట్రోలర్ శ్రీధర్‌రెడ్డి



జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థినులతో మాట్లాడుతున్న ప్రభుత్వ పరీక్షల అసిస్టెంట్ కంట్రోలర్ శ్రీధర్‌రెడ్డి

ఎలమంచిలి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు జారీ చేసే హాల్‌టికెట్లపై కొత్తగా క్యూఆర్ కోడ్ వుంటుందని పరీక్షల అసిస్టెంట్ కంట్రోలర్ ఎ.శ్రీధర్‌రెడ్డి తెలిపారు. సోమవారం ఆయన ఎంఈఓ సూర్యప్రకాశరావుతో కలిసి పట్టణంలో పదో తరగతి పరీక్షలు నిర్వహించే కొత్తపేట జడ్పీ ఉన్నత పాఠశాల, బాలికోన్నత పాఠశాల, శ్రీచైతన్య, సెయింట్ మేరీస్ పాఠశాలలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పదో తరగతి పరీక్షలకు జిల్లా నుంచి సుమారు 21 వేల మంది విద్యార్థులు హాజరుకానున్నారని, వీరి కోసం 107 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని వెల్లడించారు. హాల్‌టికెట్లకు సంబంధించి ప్రభుత్వ ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి హాల్ టిక్కెట్లపై క్యూఆర్ కోడ్‌ను ముద్రించనుందని తెలిపారు. ఇది విద్యార్థులకు ఎంతో ఉపయుక్తంగా వుంటుందని, క్యూర్ కోడ్‌ను స్కాన్ చేస్తే గూగుల్ మ్యాప్ ద్వారా పరీక్షా కేంద్రానికి సులభంగా చేరుకునే అవకాశం వుంటుందన్నారు. పదో తరగతి పరీక్షలు నిర్వహించే కేంద్రాల్లో తాగునీరు, విద్యుత్తు, ఫర్నిచర్, ఇతర మౌలిక వసతుల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించామని చెప్పారు. ఈ సందర్భంగా పదో తరగతి విద్యార్థులకు పలు సూచనలు చేశారు. పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించేలా విద్యార్థులను తగిన తర్ఫీదు, ప్రత్యేక శిక్షణ ఇవ్వాలని ఉపాధ్యాయులకు సూచించారు.

పెరిగిన చలితీవ్రత

- శీతల గాలులతో జనం గజగజ
- దట్టం కురుస్తున్న పొగమంచు

మాడుగుల రూరల్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలో చలితీవ్రత పెరిగింది. ఏజెన్సీని ఆనుకొని వుండడంతో దాదాపు అన్ని గ్రామాల్లో కనిష్ఠ ఉష్ణోగ్రతలు పడిపోతున్నాయి. సుమారు వారం రోజుల నుంచి ఉష్ణోగ్రతలు క్రమేపీ తగ్గిపోతూ ప్రస్తుతం 15 డిగ్రీల వరకు నమోదు అవుతున్నట్టు తెలిసింది. చలితీవ్రతకు తోడు మంచుదట్టంగా కురుస్తుండడంతో జనం ఇబ్బంది పడుతున్నారు. తెల్లవారుజాము నుంచి ఉదయం తొమ్మిది గంటల వరకు తుంపర్ల మాదిరిగా మంచుపడుతున్నది. వాహనాలకు లైట్లు వేసుకుని నెమ్మదిగా వెళుతున్నారు.ప్రస్తుతం వరి కోతల పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. అయితే చలితీవ్రత, దట్టంగా కురుస్తున్న మంచు కారణంగా వరి కోతలను ఆలస్యంగా మొదలుపెట్టాల్సి వస్తున్నదని, వరిపనలు సైతం త్వరగా ఎండడం లేదని రైతులు చెబుతున్నారు.

ఆదమరిస్తే అంతే..

- అధ్వానంగా ఎలమంచిలి-గాజువాక ప్రధాన రహదారి
- పరవాడ మండలంలో పలుచోట్ల పెద్దపెద్ద గోతులు
- ప్రమాదాలబారిన వాహనదారులు
- ఇబ్బంది పడుతున్న ప్రయాణికులు

పరవాడ, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఎలమంచిలి- గాజువాక ప్రధాన రహదారిలో స్థానిక ఊటగెడ్డ జంక్షన్ నుంచి బంగ్లా జంక్షన్ వరకు రోడ్డు పలుచోట్ల అధ్వానంగా తయారైంది. నిత్యం వాహనాల రాకపోకలతో రద్దీగా ఉండే ఈ రహదారిలో పలుచోట్ల పెద్దపెద్ద గుంతలు ఏర్పడ్డాయి. వీటి వల్ల వాహనాలు పాడైపోవడమే కాకుండా తరుచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ప్రయాణించే సమయం అధికం అవుతున్నది. ఈ రహదారికి మరమ్మతులు చేపట్టి ఏడాది కాక ముందే పరిస్థితి మళ్లీ మొదటి రావడంపై (గోతులు ఏర్పడడం) వాహనచోదకులు మండిపడుతున్నారు. సింహాద్రి ఎన్టీపీసీ, అచ్యుతాపురం సెజ్, ఫార్మాసిటీకి చెందిన కార్మికులు, ఉద్యోగులు, మండలంలోని పలు గ్రామాల ప్రజలతోపాటు గాజువాక, విశాఖపట్నం, ఎలమంచిలి, తదితర ప్రాంతాలకు చెందిన వారు ఈ రహదారిపై రాకపోకలు సాగిస్తుంటారు. పలుచోట్ల గోతులు ఏర్పడడంతో వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గోతుల వద్ద ఏమాత్రం అజాగ్రత్తగా వున్నా.. ప్రమాదానికి గురికాక తప్పదని అంటున్నారు. రాత్రిపూట దగ్గరకు వచ్చే వరకు గోతులు కనిపించకపోవడంతో ద్విచక్ర వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. పరిమితికి మించి బొగ్గు లోడు తో ప్రయాణిస్తున్న లారీలు గోతుల వద్ద అదుపుతప్పి బోల్తా పడిన సందర్భాలు ఎన్నో వున్నాయని స్థానికులు అంటున్నారు.



రాజా హోటల్ సమీపంలో ఛిద్రమైన రోడ్డు



పరవాడ సినిమాహాల్ జంక్షన్ సమీపంలో రహదారిపై పెద్ద గొయ్యి

వ్యాన్ ఢీకొని యువకుడి మృతి

- స్వస్థలం బిహార్ రాష్ట్రం
- ఉపాధి కోసం లంకెలపాలేనికి రాక



పవన్‌కుమార్ (ఫైల్ ఫొటో)

లంకెలపాలెం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): విధులకు హాజరు కావడానికి సైకిల్‌పై కంపెనీకి వెళుతున్న కార్మికుడిని.. వ్యాన్ రూపంలో మృత్యువు కబళించింది. జాతీయ రహదారిపై లంకెలపాలెం పెట్రోల్ బంకు సమీపంలో సోమవారం ఉదయం జరిగిన ప్రమాదంలో ఓ యువకుడు మృతిచెందాడు. ఈ సంఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలిలా వున్నాయి.

బిహార్ రాష్ట్రం ముజఫర్‌పూర్ జిల్లా ఖరౌనా జైరామ్ ప్రాంతానికి చెందిన పవన్‌కుమార్ (27) ఉపాధి నిమిత్తం ఐదేళ్ల క్రితం లంకెలపాలెం ప్రాంతానికి వలస వచ్చాడు. అగనంపూడి సమీపంలోని మినీ ఆటోనగర్‌లో వున్న ఒక కంపెనీలో కార్మికుడిగా పనిచేస్తున్నాడు. తోటి కార్మికులతో కలిసి లంకెలపాలెంలో నివాసం వుంటున్నాడు. రోజూ మాదిరిగానే సోమవారం ఉదయం కూడా సైకిల్‌పై విధులకు బయలుదేరాడు. లంకెలపాలెం పెట్రోల్ బంకు వద్దకు వచ్చేసరికి వెనుక నుంచి వస్తున్న మినీవ్యాన్ బలంగా ఢీకొంది. దీంతో పవన్‌కుమార్ తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతిచెందాడు. ఇతని భార్య రంభకుమారి, నాలుగేళ్ల కుమార్తె, ఏడాది కుమారుడు ఉన్నారు. ప్రస్తుతం ... మిగతా 8వ పేజీలో

కొత్త నిర్ణయం ప్రజలకు భారం కాకూడదు

» మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్



మాట్లాడుతున్న మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్

మునగపాక, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఏదైనా కొత్త నిర్ణయం తీసుకునే ముందు అది ప్రజలకు భారం కాకుండా ఉండే విధంగా ఆలోచనలు చేయాలని మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. మునగపాకలో వైసీపీ ఆధ్వర్యంలో సోమవారం చేపట్టిన రిలే నిరాహార దీక్ష శిబిరానికి ఆయన వచ్చి సంఘీభావం తెలిపారు. నక్కపల్లి డివిజన్‌లో ఎలమంచిలి నియోజకవర్గాన్ని విలీనం చేయడం ప్రజలను ఇబ్బందులకు గురిచేయడమే అవుతుందన్నారు. కిలోమీటర్ దూరంలో ఉన్న డివిజన్‌ను వదులుకొని 55 కిలోమీటర్ల దూరంలో ఉన్న నక్కపల్లి వెళ్లడం సరైన పద్ధతి కాదని, ప్రభుత్వం పునరాలోచన చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు కరణం ధర్మశ్రీ, బొడ్డేడ ప్రసాద్, ఆడారి గణపతి అచ్చింనాయుడు, బొద్దపు శ్రీరామ్మూర్తి, శరగడం జగన్నాథరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు ఆంజనేయస్వామి ఆలయ ద్వితీయ వార్షికోత్సవం

అచ్యుతాపురం డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మెట్ట ధర్మవరంలో ఆంజనేయస్వామి ద్వితీయ వార్షికోత్సవం మంగళవారం నిర్వహిస్తున్నట్టు ఉత్సవ కమిటీ చైర్మన్ రెడ్డి దేముడు తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం ఉదయం నుంచి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నామన్నారు. రాంబిల్లి, అచ్యుతాపురం మండలాల సరిహద్దుల్లో ఈ ఆలయం ఉన్నందున రెండు మండలాలకు చెందిన భక్తులు వచ్చి పూజలు చేస్తారన్నారు.

ఎలమంచిలిని రెవెన్యూ డివిజన్‌గా ప్రకటించాలి

ఎలమంచిలి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఎలమంచిలిని రెవెన్యూ డివిజన్ కేంద్రంగా ప్రకటించాలని కోరుతూ సోమవారం ఎలమంచిలిలో వైసీపీ నేతలు ర్యాలీ చేపట్టారు. నియోజకవర్గ సమన్వయకర్త కరణం ధర్మశ్రీ, మునిసిపల్ వైస్ చైర్మన్‌లు బెజవాడ నాగేశ్వరరావు, ఆరెపు గుప్తా, మండల పార్టీ అధ్యక్షుడు కొల్లి త్రినాథ్ ర్యాలీలో పాల్గొన్నారు. ఎలమంచిలిలో రెవెన్యూ డివిజన్‌ను ఏర్పాటు చేసినట్టయితే అన్ని వర్గాల ప్రజలకు ఉపయుక్తంగా ఉంటుందన్నారు. అనంతరం తహశీల్దారు వరహాలుకు పలు డిమాండ్లతో ఉన్న వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు బొద్దపు యర్రయ్యదొర, తదితరులు పాల్గొన్నారు.

ఘన వ్యర్థాలపై ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థుల ర్యాలీ

ఎలమంచిలి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లైను కొత్తూరు గ్రామంలో సోమవారం జాతీయ సేవా పథం యూనిట్-2 విద్యార్థులు ఇంటింట తిరిగి ఘనవ్యర్థాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. ప్రోగ్రామ్ అధికారి అర్జున అప్పారావు ఆధ్వర్యంలో విద్యార్థులు తడి చెత్త, పొడి చెత్త సేకరణ గురించి వివరించారు. గ్రామసెక్రటరీ గిరి ప్రసాద్ పాల్గొన్నారు.

100 రోజుల ప్రణాళికలపై ఆరా

నక్కపల్లి, డిసెంబరు8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చినదొడ్డిగల్లు జడ్పీ హైస్కూల్‌ను సోమవారం మండల మోనటరింగ్ కమిటీ సందర్శించింది. ఎంఈవోలు కె.నరేశ్, రుత్తల నాగన్నదొర నేతృత్వంలోని కమిటీ హైస్కూల్‌లో వున్న సమస్యలపై ఆరా తీశారు. టెన్త్ విద్యార్థుల కోసం అమలుచేస్తున్న 100 రోజుల ప్రణాళికల అమలు, మధ్యాహ్న భోజనం, విద్యార్థుల హాజరు, పఠనా నైపుణ్యం, నోటు పుస్తకాలను కమిటీ ప్రతినిధులు పరిశీలించారు. హైస్కూల్ హెచ్‌ఎం బాలాజీతో మాట్లాడారు. అనంతరం ఉపాధ్యాయులతో సమావేశమయ్యారు. ఈ బృందంలో ఉపాధ్యాయులు ప్రభావతి, రమణికుమారి, వైవీ రమణ, రమేశ్, ప్రభాకర్, శేషగిరి ఉన్నారు.

ఏపీ ఎన్‌జీఓల సంఘం నక్కపల్లి తాలూకా యూనిట్ నూతన కార్యవర్గం



ఏపీఎన్‌జీఓస్ నక్కపల్లి తాలూకా యూనిట్ నూతన కార్యవర్గం

పాయకరావుపేట/రూరల్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఏపీ ఎన్‌జీఓల సంఘం నక్కపల్లి తాలూకా యూనిట్ నూతన కార్యవర్గం ఎన్నిక ఏకగ్రీవం అయ్యింది. సోమవారం స్థానిక మండల పరిషత్ కాంప్లెక్స్‌లో నర్సీపట్నం యూనిట్ కార్యదర్శి జీవీ.రమణబాబు ఆధ్వర్యంలో నక్కపల్లి యూనిట్ నూతన కార్యవర్గం ఎన్నిక ఏకగ్రీవంగా జరిగింది. ఈ సందర్భంగా జీవీ.రమణబాబు మాట్లాడుతూ నూతన అధ్యక్షుడిగా కె.శ్రీనివాసరావు, అసోసియేట్ అధ్యక్షుడిగా పి.రామగోవిందు, ఉపాధ్యక్షులుగా పి.రాముడు, సీహెచ్.రామకృష్ణ, బి.లక్ష్మణరాజు, కార్యదర్శిగా ఆర్.రాము, సంయుక్త కార్యదర్శులుగా షేక్ రంజాన్ బీబీ, కె.ప్రభాకర్‌కుమార్, ఎం.దుర్గశివగణేష్, డి.కుమారి, కోశాధికారిగా ఎం.వెంకటరెడ్డి ఎన్నికయ్యారని తెలిపారు. అనంతరం నూతన కార్యవర్గానికి పలువురు అభినందించారు.

'నామవరంలో కబర్‌కు స్థలాన్ని కేటాయించాలి'

పాయకరావుపేట, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నామవరంలో నివాసముంటున్న ముస్లింలకు అవసరమైన కబర్ (శ్మశానవాటిక)కు స్థలాన్ని కేటాయించాలని పలువురు ముస్లింలు అధికారులకు విజ్ఞప్తిచేశారు. సోమవారం నామవరం గ్రామానికి చెందిన మస్జిద్ ఎ మదీనా కమిటీ ఆధ్వర్యంలో ముస్లింలు తహశీల్దారు ఎస్‌ఏ.మహేష్‌ని కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు షేక్ వెంకా సాహెబ్, షేక్ నాగూర్ మాట్లాడుతూ నామవరంలో 50 ముస్లిం కుటుంబాలు తాతముత్తాల నుంచి నివాసం ఉంటున్నారని చెప్పారు. గ్రామంలో ముస్లింలు మృతిచెందితే దానపర్చేందుకు కబర్ స్థలం లేకపోవడంతో ఉన్న కొద్దిపాటి స్థలంలోనే కళేబరాల పక్కనే దానపర్చాల్సి వస్తోందని వాపోయారు. అధికారులు స్పందించి కబర్ స్థలం కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో మస్జిద్ ఎ మదీనా కమిటీ కోశాధికారి షేక్ షాజహాన్ బాయ్, సభ్యులు సత్తార్, నాగూర్, సుభాన్, మీరా తదితరులు పాల్గొన్నారు.

విద్యా సమస్యలు పరిష్కరించాలని ఎస్‌ఎఫ్‌ఐ ర్యాలీ



బస్టాండ్ జంక్షన్ వద్ద ఆందోళన చేస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ ప్రతినిధులు

ఎలమంచిలి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): విద్యాపరమైన సమస్యలను పరిష్కరించి, విద్యార్థులకు ఉపయుక్తంగా ఉండేలా చేయాలని కోరుతూ సోమవారం ఆర్టీసీ బస్టాండ్ నుంచి తహశీల్దార్ కార్యాలయం వరకు విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు బాలాజీ మాట్లాడుతూ ఫీజు రీయింబర్స్ బకాయిలను చెల్లించాలని డిమాండ్ చేశారు. సంక్షేమ వసతి గృహాల్లో సురక్షితమైన తాగునీటిని అందించాలన్నారు. పీజీ విద్యార్థులకు శాపంగా మారిన జీవో నంబరు 77ని రద్దు చేయాలన్నారు. అనంతరం వినతిపత్రాన్ని తహశీల్దారు కె. వరహాలుకు అందజేశారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ ప్రతినిధులు గౌతమ్, కృప, రాజేష్, రామచేంద్ర, బాగ్య, భవానీలు పాల్గొన్నారు.

మునగపాక సంపద కేంద్రానికి తాళం

» నిలిచిన పారిశుధ్య పనులు



సంపద కేంద్రానికి తాళం వేసిన దృశ్యం

మునగపాక, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): చెత్తకు పెట్టిన నిప్పు ఆరలేదు.. సమీప కాలనీ వాసుల్లో ఆవేశం తగ్గలేదు. ఫలితంగా మునగపాక చెత్తసేకరణ కేంద్రానికి తాళం వేసే స్థాయికి చేరింది. మేజర్ పంచాయతీ అవసరాలకు అనుగుణంగా తడి, పొడి చెత్త సేకరణ కేంద్రాన్ని కూడా నిర్మాణం చేశారు. గ్రామంతో రోజూ సేకరించిన చెత్తను ఏడాదిలో ఒకటి, రెండు సార్లు తరలించే పనులు కూడా చేస్తూనే ఉన్నాయి. తరలించడానికి వీలుపడని చెత్తకు గత నెలలో నిప్పు పెట్టారు. చెత్త నుంచి దట్టంగా పొగ విస్తరించడంతో సమీపంలో ఉన్న శెట్టిబలిజ కాలనీ వాసులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామంటూ అప్పట్లో వాపోయారు. అయినా సమస్య పూర్తిగా అదుపులోకి రాకపోవడంతో గుర్తు తెలియని వ్యక్తులు ఆదివారం రాత్రి చెత్తసేకరణ కేంద్రానికి తాళం వేశారు. రోజు మాదిరిగానే పారిశుధ్య పనుల్లో భాగంగా కార్మికులు సోమవారం ఉదయం కేంద్రానికి వెళ్లారు. గేటుకు వారు వేసిన తాళం పగలుగొట్టి, మరో తాళం వేసి ఉండడాన్ని చూసి అవాక్కయ్యారు. ఈ విషయాన్ని గ్రామ సర్పంచ్ దిమ్మల అప్పారావుకు, పంచాయతీ కార్యదర్శికి తెలియజేశారు. ఈ సంఘటనపై మునగపాక పోలీసులకు ఫిర్యాదు చేశారు.

గెడ్డపాలెంలో పురావస్తు శాఖ అధికారుల పర్యటన

కొండపై ఉన్న బౌద్ధ విగ్రహాలు, గుహ పరిశీలన

ఎస్.రాయవరం, డిసెంబరు 8 (ఆంధ్ర జ్యోతి): మండలంలోని గెడ్డపాలెం గ్రామంలో సోమవారం రాష్ట్ర పురావస్తు శాఖ అధికారులు పర్యటించారు. గ్రామ శివారులో కొండపై ఉన్న పురాతన బౌద్ధ విగ్రహాలు, గుహను అసిస్టెంట్ డైరెక్టర్ ఆర్ ఫల్గుణరావు బృందం స్థానికుల సాయంతో వెళ్లి పరిశీలించారు. కొండపై ఉన్న రాతి విగ్రహాలు, గుహ ఫొటోలను అధికారులు సేకరించారు. ఈ సందర్భంగా ఫల్గుణరావు మాట్లాడుతూఇక్కడి పురాతన బౌద్ధ విగ్రహాలు, గుహలపై నివేదికను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళతామన్నారు. కార్యక్రమంలో పురావస్తు శాఖ టెక్నికల్ అసిస్టెంట్ కె. శ్రీనివాసరావు, ఆర్కియాలజికల్ అసిస్టెంట్ డి. విశ్వేశ్వరరావు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.



గెడ్డపాలెంలో కొండపై ఉన్న బౌద్ధ రాతి విగ్రహం

ఎలమంచిలిలో రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేయాలి

» కలెక్టర్‌కు డివిజన్ సాధన సమితి వినతి

ఎలమంచిలి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ డివిజన్‌ను ఎలమంచిలిలో ఏర్పాటు చేయాలని కోరుతూ సోమవారం రెవెన్యూ డివిజన్ సాధన సమితి ప్రతినిధులు జిల్లా కలెక్టర్ విజయ్ కృష్ణన్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సాధన సమితి ప్రతినిధి మళ్ల కొండబాబు మాట్లాడుతూ జిల్లా కలెక్టరుతో పాటు ఆర్డీఓ, తదితర అధికారులకు వినతిపత్రాలను అందజేశామన్నారు. రెవెన్యూ డివిజన్‌ను ఎలమంచిలిలో ఏర్పాటు చేసినట్టయితే అన్ని మండలాలకు మధ్యస్తంగా ఉంటుందన్నారు. ఎలమంచిలిలో అన్ని ప్రభుత్వ కార్యాలయాలు ఉన్నాయని, ప్రజలందరికీ పూర్తిస్థాయిలో సేవలు అందించేందుకు అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో పెన్షనర్స్ సంఘాధ్యక్షుడు సీహెచ్. సోమేశ్వరరావు, విశ్రాంత అధ్యాపకులు ఆడారి పూరి జగన్నాథం, యల్లపు రాజు, కరణం శ్రీహరి, నక్కా శివశంకర్, అతికినశెట్టి పైడికొండ, పిట్టా దాసుబాబు, కమలాకర్ పాల్గొన్నారు.



కలెక్టరేట్ వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న రెవెన్యూ డివిజన్ సాధన సమితి ప్రతినిధులు

సాధువు బ్యాంకు ఖాతా నుంచి రూ. 9.43 లక్షల స్వాహా

» పీజీఆర్‌ఎస్‌లో సామాజిక కార్యకర్త రాజు ఫిర్యాదు

ఎస్.రాయవరం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): కొన్ని నెలల క్రితం మృతి చెందిన మండలంలోని గెడ్డపాలెం గ్రామానికి చెందిన సుబ్బరాజు సాధువు బ్యాంకు ఖాతాలో ఉన్న రూ.9.43 లక్షల నగదును అదే గ్రామానికి చెందిన ఓ వ్యక్తి ఏటీఎం ద్వారా విత్‌డ్రా చేసి స్వాహా చేశాడంటూ సోమవారం పీజీఆర్‌ఎస్‌లో జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్టు సామాజిక కార్యకర్త సోమిరెడ్డి రాజు తెలిపారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుబ్బరాజు సాధువు మృతి చెందిన నాటికి ఆయన బ్యాంకు ఖాతాలో రూ 9,43,043 నగదు ఉండేదని, సాధువు వద్ద కూలి పనిచేస్తున్న ఓ వ్యక్తి ఆయన మృతి చెందిన తరువాత సాధువు ఏటీఎం దొంగలించి, పెనుగొల్లు బ్యాంకు ఖాతాలో ఉన్న రూ.9.43 లక్షలను విత్‌డ్రా చేశాడన్నారు. దీనిపై విచారణ జరిపి సంబంధిత వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని కోరినట్టు రాజు చెప్పారు.

వ్యాపారవేత్త నారాయణరావుకు నివాళి



ధర్మవరంలో నారాయణరావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కరణం ధర్మశ్రీ, పలువురు ప్రముఖులు

ఎలమంచిలి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఎలమంచిలి ధర్మవరంలో సోమవారం వ్యాపారవేత్త సూరకాసుల నారాయణరావు సంస్మరణ సభ జరిగింది. ఈ సందర్భంగా పలువురు ప్రముఖులు ఆయన చిత్రపటం వద్ద నివాళులర్పించారు. వైసీపీ నియోజకవర్గ సమన్వయకర్త కరణం ధర్మశ్రీ, మాజీ ఎంపీపీ బొద్దపు యర్రయ్యదొర, మునిసిపల్ మాజీ వైస్ చైర్మన్ కొఠారు సాంబ, డాక్టర్ గోపాలరావు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు ఆడారి శ్రీధర్, పలువురు న్యాయవాదులు, కౌన్సిలర్లు, ప్రజా ప్రతినిధులు, వ్యాపారులు నారాయణరావుకు నివాళులర్పించారు. ఆయన కుటుంబ సభ్యులు సూరకాసుల శ్రీను, నానిలను వారు పరామర్శించారు.

తహశీల్దార్ ఎదుట మల్లవరం పంచాయితీ

మునగపాక, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): వైసీపీ పాలనలో రోడ్డున పడ్డ కొత్త పంచాయతీలకు పక్కా భవనాలు నిర్మించడానికి కూటమి ప్రభుత్వం చొరవ చూపుతోంది. దానిలో భాగంగా ఇటీవల కాకరాపల్లిలో పంచాయతీ భవన నిర్మాణానికి ఎమ్మెల్యే సుందరపు విజయ కుమార్ శంకుస్థాపన చేసిన విషయం తెలిసిందే. ఇప్పుడు మల్లవరంలో పంచాయతీ

పంచాయతీ భవన నిర్మాణ స్థల ఎంపికపై తలోమాట

భవనం నిర్మాణానికి సంబంధించి స్థల ఎంపిక అంశంపై సోమవారం గ్రామస్థులు తహశీల్దార్‌తో సమావేశం అయ్యారు. గతంలో భవన నిర్మాణానికి స్థల పరిశీలనతో పాటు తీర్మానం చేసి రెవెన్యూ కార్యాలయానికి అందజేశారు. మల్లవరంతో పాటు అప్పికొండవానిపాలెం, కుంచవానిపాలెం గ్రామాలు కూడా ఈ పంచాయతీ పరిధిలోనివే కావడంతో స్థల ఎంపికలో భిన్నాభిప్రాయాలు తలెత్తాయి. దీంతో సోమవారం తహశీల్దార్, పంచాయతీరాజ్ జేఈలు మల్లవరం వెళ్లి స్థల పరిశీలన చేశారు. స్కూల్‌కు సమీపంలో ఉన్న గ్రామకంఠాన్ని కూడా పరిశీలించారు.

పారా అథ్లెటిక్స్ పోటీల్లో పాములవాక విద్యార్థికి గోల్డ్‌మెడల్

కోటవురట్ల, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పాములవాక జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి పోతల దుర్గాప్రసాద్ అనకాపల్లిలో జరిగిన పారా అథ్లెటిక్ జిల్లా స్థాయి పోటీల్లో గోల్డ్‌మెడల్ సాధించాడు. దుర్గాప్రసాద్ 400 మీటర్ల పరుగులో విన్నర్‌గా నిలిచినట్టు పాఠశాల హెచ్‌ఎం లక్ష్మీనారాయణ తెలిపారు. ఈమేరకు సోమవారం హైస్కూల్‌లో దుర్గాప్రసాద్‌ను ఎంఈవో రామారావు, పీడీ సావిత్రి, ఉపాధ్యాయులు అభినందించారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించి పాఠశాల, ఊరుకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.



దుర్గాప్రసాద్‌ను అభినందిస్తున్న హెచ్‌ఎం, ఎంఈవో, ఉపాధ్యాయులు

సాగు పత్రాలను మంజూరు చేయాలి

» తహశీల్దార్‌ను కోరిన పేద రైతులు

పాయకరావుపేట, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మూడు దశాబ్దాలుగా సాగుచేసుకుంటున్న తమ భూములకు సాగు పత్రాలు మంజూరు చేయాలని పలువురు పేద రైతులు అధికారులకు విజ్ఞప్తిచేశారు. సోమవారం పాల్మన్‌పేటకు చెందిన పేద రైతులు తహశీల్దారు ఎస్‌ఏ.మహేష్‌ని కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. అనంతరం గవల భారతి తదితరులు మాట్లాడుతూ కుమారపురం రెవెన్యూలోని డి పట్టా భూములను మూడు దశాబ్దాల క్రితం కొనుగోలు చేశామన్నారు. అప్పట్లో ఈ భూములను విక్రయించిన వారు ఒరిజినల్ డి పట్టా, పాసు పుస్తకాలు అప్పగించడంతో పాటు భవిష్యత్‌లో రిజిస్ట్రేషన్ చేయాల్సి వస్తే కుటుంబ సభ్యులంతా వచ్చి సంతకాలు చేస్తామని పెద్దల వద్ద అంగీకారంతో కొనుగోలు చేశామన్నారు.అప్పటి నుంచి ఈ భూముల్లో జీడిమామిడి తోటలు పెంచుకుని జీవనోపాధి పొందుతున్నామన్నారు. ప్రస్తుతం భూముల రీ సర్వే జరుగుతున్నందున తాము సాగు చేసుకుంటున్న భూములకు తమ పేరిట సాగు పత్రాలు మంజూరు చేసి ఆదుకోవాలని అధికారులకు కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్.నరేంద్ర, బత్తిన శ్రీను, సీహెచ్.జాన్, వి.అమ్మాజీ, పిక్కి కోదండరావు, డి.ధనరెడ్డి, నాగరాజు, వరలక్ష్మి, రమణ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పాల్మన్‌పేటకు చెందిన పేద రైతులు



డీసీసీబీ బ్రాంచి కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న సహకార ఉద్యోగులు

సహకార ఉద్యోగుల ధర్నా

ఎలమంచిలి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఎలమంచిలిలోని డీసీసీబీ బ్రాంచి కార్యాలయం వద్ద సోమవారం సహకార సంఘాల ఉద్యోగులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా జేఏసీ ప్రతినిధి శివరామకృష్ణ మాట్లాడుతూ జీఓ నంబరు 36 వెంటనే అమలు పరిచి 2019, 2024 తాలూకు పెండింగ్‌లో ఉన్న వేతన సవరణలు చేయాలన్నారు. అప్పటివరకు మధ్యంతర భృతి ఇవ్వాలని, ఉద్యోగులకు చెల్లించే గ్రాట్యూటీ సిలింగ్ తదితర 11 డిమాండ్లను పరిష్కరించాలని కోరారు. అనంతరం డీసీసీబీ బ్రాంచి మేనేజరుకు వినతిపత్రాన్ని అందజేశారు.

నక్కపల్లి డివిజన్ ఏర్పాటుపై హర్షం

కోటవురట్ల, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): నక్కపల్లి కేంద్రంగా రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేయడం పట్ల టీడీపీ మండల నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేశారు. సోమవారం మండలంలోని జల్లూరు గ్రామంలో టీడీపీ మండల అధ్యక్షుడు పెట్లలింగం నాయుడు, కోటవురట్ల సొసైటీ చైర్‌పర్సన్ వేచలపు జనార్దన్ మాట్లాడుతూ మండలానికి నర్సీపట్నం దగ్గరగా ఉన్నప్పటికీ నక్కపల్లి రెవెన్యూ డివిజన్‌లో మండలాన్ని చేర్పించడం మంచి పరిణామని అన్నారు.. నక్కపల్లి కేంద్రంగా అనేక పరిశ్రమలు రావడం వస్తుండడంతో మండలాన్ని నక్కపల్లి డివిజన్ చేర్పించడం కోటవురట్ల మరింత అభివృద్ధి చెందుతుందన్నారు పరిశ్రమల్లో యువకులకు ఉపాధి అవకాశాలు దొరుకుతాయని వారు ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రజలకు పరిపాలన సౌలభ్యంగా ఉంటుందని ముందుచూపుతో ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. నక్కపల్లిలో రెవెన్యూ డివిజన్ ఏర్పాటుకు రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత కృషి ఎంతో ఉందని కొనియడారు. సమావేశంలో రాజుపేట సర్పంచ్ బొడ్డేటి వెంకటరమణ, పీఏసీఎస్ డైరెక్టర్లు సుంకర్ బాబ్జి, చిటికెల సత్యానారాయణ, కొడవటిపూడి ఎంపీటీసీ సభ్యుడు యలమంచిలి ప్రకాష్, తెలుగుయువత మండల అధ్యక్షుడు తిరుమలరావు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు

ఇళ్ల శంకుస్థాపనకు గడువు ఇవ్వండి

» తహశీల్దార్‌ను కోరిన టీడీపీ నాయకులు

నక్కపల్లి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెదబోదిగల్లంలో కారిడార్ నిర్వాసిత రైతులకు కేటాయించిన పునరావాస కాలనీలో గృహ నిర్మాణాలకు కొంత గడువు ఇవ్వాలని టీడీపీ నేతలు కోరారు. ఈ మేరకు సోమవారం లబ్దిదారుల తరపున టీడీపీ నియోజకవర్గం కన్వీనర్ కొప్పిశెట్టి వెంకటేష్, టీడీపీ మండల అధ్యక్షుడు గింజాల లక్ష్మణరావు, తెలుగు యువత మండల అధ్యక్షుడు కమ్మెల శివరామకృష్ణరాజు, ఎరిపిల్లి అప్పలరాజు, తదితరులు తహశీల్దార్ నర్సింహమూర్తిని కలిశారు. ప్రస్తుతం ఇళ్ల శంకుస్థాపనకు మూఢం వున్నందున మంచి రోజులు వచ్చే వరకూ శంకుస్థాపన చేయలేని పరిస్థితి నెలకొందని వివరించారు. అందువల్ల అమలాపురం, వేంపాడు, డీఎల్‌పురం, చందనాడ, బుచ్చిరాజుపేట పంచాయతీ పరిధిలో గల నిర్వాసితులకు ఇళ్ల శంకుస్థాపనకు కొంత గడువు కావాలని కోరారు. ఈ విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామని తహశీల్దార్ హామీ ఇచ్చారు. ఇప్పటికే తాము హోం మంత్రి అనిత దృష్టికి తీసుకెళ్లామని వెంకటేశ్ చెప్పారు. ఇందులో కుర్రా బాబ్జీహరికృష్ణ పాల్గొన్నారు.



తహశీల్దార్ నర్సింహమూర్తితో మాట్లాడుతున్న కొప్పిశెట్టి వెంకటేశ్ తదితరులు

పోలీసుల అదుపులో ఎనిమిది మంది పేకాటరాయుళ్లు

» రూ.14,700 నగదు, ఆరు సెల్‌ఫోన్లు స్వాధీనం

పాయకరావుపేట, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి):పట్టణంలోని వీహెచ్ వాడలో పేకాట ఆడుతున్న ఎనిమిది మందిని పోలీసులు ఆదివారం రాత్రి అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.14,700ల నగదు, ఆరు సెల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. దీనికి సంబంధించి సోమవారం సీఐ అప్పన్న వివరాలు అందజేస్తూ పట్టణంలోని వీహెచ్.వాడలోని బహిరంగ ప్రదేశంలో పేకాట ఆడుతున్నారన్న పక్కా సమాచారంతో ఎస్‌ఐ పురుషోత్తం, ఏఎస్‌ఐ గోవిందుతోపాటు సిబ్బందితో వెళ్లి ఎనిమిది మందిని అదుపులోకి తీసుకుని, వారి నుంచి రూ.14,700ల నగదుతో పాటు ఆరు సెల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు.

చినతీనార్లలో బైక్‌కు నిప్పు

నక్కపల్లి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చినతీనార్లలో గరికిన రాము అనే మహిళ పేరుతో వున్న బైక్‌ను ఆదివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టి కాల్చివేశారంటూ సోమవారం నక్కపల్లి పోలీసులకు ఫిర్యాదు అందింది. తన పేరుతో రిజిస్ట్రేషన్ చేసిన బైక్‌ను తన సోదరుడు నడుపుకుంటున్నాడని ఆ ఫిర్యాదులో పేర్కొంది. ఆదివారం రాత్రి 10.30 గంటల ప్రాంతంలో తన ఇంటి వద్దే బైక్‌ను పార్కింగ్ చేశామని, సోమవారం ఉదయం 6 గంటలకు తమ ఇంటికి సుమారు 100 మీటర్ల దూరంలో బైక్ పూర్తిగా కాలిపోయి కనబడిందని పేర్కొన్నారు. ఈ ఫిర్యాదుపై సమగ్ర పరిశీలన చేస్తున్నామని ఎస్‌ఐ సన్నిబాబు చెప్పారు.

లబ్ధిదారుల ఎంపికలో నిబంధనలు పాటించాలి

మునగపాక, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): సంక్షేమ పథకాలు అమలుకు సంబంధించిన ఎంపికలో నిబంధనలు పాటించాలని ఎంపీడీవో ఎం.ఉషారాణి తెలిపారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సచివాలయ సిబ్బందితో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. గృహ నిర్మాణంలో లబ్ధిదారుల దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి, పరిగణనలోకి తీసుకోవాలన్నారు. రేషన్ కార్డులో మార్పులు, చేర్పులు విషయంలో తీసుకోవలసిన అంశాలపై వివరించారు. ఈ కార్యక్రమంలో పలు శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని సీఆర్‌ఎంటీల వినతి

మునగపాక, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): వేతనాలతో పాటు పలు సమస్యల పరిష్కారానికి సీఆర్‌ఎంటీలు తహశీల్దార్‌కు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఆర్‌ఎంటీ యూనియన్ నాయకుడు కర్రి లక్ష్మీనారాయణ మాట్లాడుతూ బి క్లస్టర్ విధానం రద్దు చేసి, సీఆర్‌ఎం టీచర్‌లకు ఎంటీఎస్ ఇవ్వాలన్నారు. బీఈడీ, టెట్ అర్హతతో సీఆర్‌ఎంటీలుగా ఉద్యోగం చేస్తున్న వారికి డీఎస్సీలో వెయిటేజ్ ఇవ్వాలని, రవాణా భత్యం కూడా ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఆర్‌ఎంటీలు అచ్యుతకృష్ణ, నూకేశ్వరరావు, సత్తిబాబు, ఎంవీఏరావు తదితరులు పాల్గొన్నారు.

రగ్బీ క్రీడాకారుల ఎంపిక రేపు

అచ్యుతాపురం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని భోగాపురం క్రీడా మైదానంలో రగ్బీ క్రీడాకారుల ఎంపిక బుధవారం జరుగుతుందని జిల్లా సంఘం గౌరవాధ్యక్షుడు కూండ్రపు వెంకునాయుడు తెలిపారు. అండర్-15, అండర్-18 మహిళా జట్ల ఎంపిక ఇక్కడ జరుగుతుందని, ఇక్కడ ఎంపికైన వారు ఈనెల 14న గుంటూరులో జరిగే రాష్ట్రస్థాయి జట్టు ఎంపికలో పాల్గొవాలన్నారు. గుంటూరులో ఎంపికైన క్రీడాకారులు ఈనెల 27, 28 తేదీల్లో చెన్నైలో జరిగే సౌత్ జోనల్ అస్మిత లీగ్ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. ఇక్కడ ఒక్కో కేటగిరిలో విజేతలకు రూ.లక్ష చొప్పున బహుమతి అందుతుందన్నారు.

రెండు గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం రేపు

ఎస్.రాయవరం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దార్లపూడి, వేమగిరి గ్రామాల్లో బుధవారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏపీఈపీడీసీఎల్ అనకాపల్లి ఈఈ రాజశేఖర్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆర్‌డీఎస్‌ఎస్ పనుల్లో భాగంగా విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామన్నారు. వినియోగాదారులు సహకరించాలని ఈఈ కోరారు.

భక్తిశ్రద్ధలతో శత చండీయాగ పూర్ణాహుతి


చండీయాగ పూర్ణాహుతి కార్యక్రమంలో పాల్గొన్న వేదపండితులు రేజేటి రామాచార్యులు

కొత్తూరు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : లోక కల్యాణార్థం నవాహ్నిక దీక్షతో శివ పంచాయతన శత చండీయాగ మహోత్సవంలో భాగంగా సోమవారం పూర్ణాహుతి కార్యక్రమం నిర్వహించారు. అనకాపల్లి పట్టణం గాంధీనగరం వెంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో జరుగుతున్న ఈ కార్యక్రమంలో వేద పండితులు, రాష్ట్ర అర్చక ఎగ్జామినర్ రేజేటి శ్రీరామాచార్యుల దంపతులు పాల్గొని యాగపూర్ణాహుతి కార్యక్రమం నిర్వహించారు. సాయంత్రం కల్యాణి భాగవతారనితో హరికథ ఏర్పాటు చేశారు. అనంతరం గౌరీ పరమేశ్వరుల కల్యాణం చేశారు. ఉత్సవ మూర్తులను యాగ ప్రాంగణంలోనే కాకుండా పురవీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రేజేటి చక్రవర్తి, కన్నబాబు, మారుతి, తదితరులు పాల్గొన్నారు.

భోగలింగేశ్వరుని సన్నిధిలో రఘునాథ్ దంపతులు


రఘునాథ్ దంపతులను సత్కరించిన చైర్మన్ సత్యనారాయణ

అనకాపల్లి టౌన్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : స్థానిక గవరపాలెం కోట మీద గల భోగలింగేశ్వర స్వామిని సోమవారం మహిళా కళాశాల ప్రతినిధి కొణతాల రఘునాథ్ దంపతులు దర్శించుకున్నారు. వారికి ఆలయ చైర్మన్ కాండ్రేగుల సత్యనారాయణ స్వాగతం పలికి స్వామివారి దర్శనం చేయించారు. అర్చకులు వేదమంత్రాలతో ఆశీర్వదించారు. వారిని సత్కరించి జ్ఞాపికను అందజేశారు.

10కె మారథాన్ ప్రారంభం


10కె రన్‌లో పాల్గొన్న విద్యార్థులు, పక్కన ప్రారంభిస్తున్న కలెక్టర్ విజయకృష్ణన్

కొత్తూరు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఏఎంఏఎల్ కళాశాలలో 10కె మారథాన్ ను కలెక్టర్ విజయకృష్ణన్ సోమవారం ప్రారంభించారు. రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ ఆదేశాల మేరకు ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ ఈ నెల 10న విశాఖపట్నం కొమ్మాదిలో జరగనున్న గిరిజన క్రీడల ఎంపికలకు ముందుగా ఏఎంఏఎల్ కళాశాలలో కబడ్డీ, గిల్లి దండా, ఆర్చరీ - రికర్వ్ క్రీడలను విజయవంతంగా నిర్వహించామన్నారు. యువత అధిక సంఖ్యలో క్రీడల్లో పాల్గొనేలా చూడాలని జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి పూజారి శైలజను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో 18 ఏళ్ల పైబడిన గిరిజన విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

పది రోజులుగా మంచినీరు వృథా

» పట్టించుకోని అధికారులు


రహదారిపై ప్రవహిస్తున్న తాగునీరు

పరవాడ, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రం పరవాడ ప్రధాన మార్గంలోని స్థానిక మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలకు సమీపంలో గత పది రోజులుగా తాగునీరు వృథాగా పోతోంది. పంచాయతీకి చెందిన రక్షిత మంచినీటి పైప్‌లైన్‌కు రహదారి అడుగు భాగంలో రంధ్రం ఏర్పడడంతో నీరు వృథాగా పోతోంది. అధికారులు పట్టించుకోకపోవడంతో రహదారిపై తాగునీరు ప్రవహిస్తోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి పైప్‌లైన్‌కు మరమ్మతులు చేపట్టి తాగునీరు వృథాను అరికట్టాలని గ్రామస్థులు కోరుతున్నారు.

నేడు మండల స్థాయి గ్రామీణ క్రీడా పోటీలు ప్రారంభం

లంకెలపాలెం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 79వ వార్డు పరిధి లంకెలపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో ఎన్టీపీసీ సౌజన్యంతో పరవాడ మండల స్థాయి గ్రామీణ క్రీడా పోటీలను మంగళవారం ప్రారంభిస్తున్నట్టు హెచ్ఎం రౌతు నాగేశ్వరరావు తెలిపారు. మండలంలో అన్ని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల నుంచి 6 నుంచి 10 తరగతి విద్యార్థుల్లో పాల్గొంటారన్నారు. బాలుర విభాగంగా కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, అథ్లెటిక్స్, బాలికల విభాగంలో కబడ్డీ, త్రోబాల్, ఖోఖో, అథ్లెటిక్స్ పోటీలను నిర్వహించనున్నట్టు చెప్పారు. ఎన్టీపీసీ ఈడీ సమీర్‌శర్మ ముఖ్య ఈ అతిథిగా హాజరై పోటీలను ప్రారంభిస్తారని ఆయన వెల్లడించారు.

పవర్‌కిక్ మార్షల్ ఆర్ట్స్‌లో దీక్షితకు బంగారు పతకం



దీక్షితను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ స్వామినాయుడు

సబ్బవరం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఆర్కిడ్ ఇంగ్లీషు మీడియం స్కూల్ 8వ తరగతి విద్యార్థిని ఆర్.దీక్షిత పవర్‌కిక్ మార్షల్ ఆర్ట్స్‌లో బంగారు పతకం సాధించిందని ప్రిన్సిపాల్ వి. స్వామినాయుడు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 7న అనపర్తి టీడీపీ కల్యాణ మండపంలో షోటోకాన్ ఆర్గనైజేషన్ కరాటే అకాడమీ ఆధ్వర్యంలో జరిగిన అటల్‌జీ రాష్ట్రస్థాయి కరాటే చాంపియన్‌షిప్ పోటీల్లో దీక్షిత సత్తా చాటి బంగారు పతకం గెలిచిందన్నారు. ఆ బాలికను ప్రిన్సిపాల్‌తో పాటు కోచ్ అప్పారావు అభినందించారు.

చింతలపాలెం చేరుకున్న భక్తుల పాదయాత్ర

కశింకోట, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : అనకాపల్లి నుంచి తిరుమల తిరుపతికి కాలినడకన వెళ్లేందుకు వేంకటేశ్వరస్వామి దీక్ష చేపట్టిన భక్తుల పాదయాత్ర సోమవారం నర్సింగబిల్లి, చింతలపాలెం గ్రామానికి చేరుకుంది. 11 మంది మాలధారణ భక్తులు ఆదివారం పాదయాత్ర ప్రారంభించగా, చింతలపాలెం గ్రామ ప్రజలు సోమవారం ఉదయం వారికి స్వాగతం పలికి అల్పాహారం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో జెర్రిపోతుల నూకునాయుడు, మరపురెడ్డి గిరిబాబు, యర్ర జ్యోతికుమార్, కాపుశెట్టి శివ, పచ్చికూర శ్రీనివాసరావు, గొంతిన నూకేశ్, రాము, బుదిరెడ్డి బాల, తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ పోటీలు ప్రారంభం

సబ్బవరం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అంతకాపల్లి శివారు రావులమ్మపాలెం గ్రామంలో గ్రామీణ క్రికెట్ పోటీలను బీజేపీ నాయకుడు చొక్కాకుల వెంకటరావు సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ క్రీడాకారుల్లో నైపుణ్యాన్ని వెలికి తీసేందుకు ప్రతి ఏడాది గ్రామీణ క్రికెట్ పోటీలను నిర్వహిస్తున్నామని చెప్పారు. ఎంతో మంది జాతీయ, అంతర్జాతీయ క్రీడాకారులు గ్రామీణ వాతావరణం నుంచి వచ్చినవారేనన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు చొక్కాకుల గోవింద, సర్పంచ్ సబ్బవరపు నారాయణమూర్తి, మాజీ సర్పంచ్ రొంగలి దేముడుబాబు, కూటమి నేతలు ఎస్.మోహన్‌గాంధీ, ఎస్.రమణ, పల్ల రమణ, కిల్లి సూర్యనారాయణ, బర్ల బాబీ, మోహన్, దేముడుబాబు తదితరులు పాల్గొన్నారు.

నిర్దేశించిన లక్ష్యాలు పూర్తి చేయాలి

» అధికారులకు కలెక్టర్ ఆదేశం


మాట్లాడుతున్న కలెక్టర్ విజయకృష్ణన్

అనకాపల్లి రూరల్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : శాఖల వారీగా నిర్దేశించిన లక్ష్యాలను పూర్తి చేయాలని అధికారులను కలెక్టర్ విజయకృష్ణన్ ఆదేశించారు. సోమవారం కలెక్టర్ కార్యాలయ సమావేశమందిరంలో పంచాయతీరాజ్, గ్రామీణ నీటి సరఫరా, డ్వామా, డీఆర్‌డీఏ, విద్యుత్, గ్రామ వార్డు సచివాలయ శాఖల అధికారులు, సిబ్బందితో శాఖల వారీగా నిర్దేశించిన లక్ష్యాలు, పూర్తి చేసిన పనులపై కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో మొదటి విడతలో 24 మ్యాజిక్ డ్రైనేజీల నిర్మాణం పూర్తయిందని, రెండవ విడతలో 24 పనులు మొదలు పెట్టి పూర్తి చేయాలని, ఇక ముందు చేపట్టే డ్రైనేజీ నిర్మాణాలన్నీ మ్యాజిక్ డ్రైనేజీ పద్ధతిలోనే చేపట్టాలని ఆదేశించారు. పశువులశాలలు, పంట కుంటలు, ఎరువుల గుంతలు, వ్యక్తిగత ఇంకుడు గుంతలు లక్ష్యం మేరకు నిర్మాణాలు వెంటనే పూర్తి చేయాలని తెలిపారు. ప్రతి కుటుంబానికి వంద రోజులు పనిదినాల కల్పన, సరాసరి వేతనం గిట్టుబాటు అయ్యే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాకు కొత్తగా ఐదు వేల పంట కుంటలు మంజూరు చేసినట్టు కలెక్టర్ తెలిపారు. సిటిజన్ ఇకేవైసీ, 05-17 సంవత్సరాల వయస్సు పిల్లలకు ఆధార్ అప్డేట్, ఆధార్ సీడింగ్ ప్రక్రియలను వెంటనే పూర్తి చేయాలని తెలిపారు. గ్రామాల్లో చెత్తను షెడ్ల వద్దకు తరలించి వర్మీ కంపోస్టు తయారుచేసి విక్రయాలు చేయాలన్నారు. ప్రతి సచివాలయం వద్ద వర్షపు నీరు భూమిలోకి ఇంకిపోయే విధంగా ఇంకుడు గుంతల నిర్మాణం చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

విత్తన బిల్లులు రద్దు చేయాలంటూ నిరసన



నెహ్రూచౌక్‌లో నిరసన కార్యక్రమం చేపడుతున్న సీపీఐ నాయకులు

తుమ్మపాల, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : విత్తన బిల్లులు, విద్యుత్ బిల్లులను తక్షణమే రద్దు చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి రెడ్డిపల్లి అప్పలరాజు డిమాండ్ చేశారు. సోమవారం నెహ్రూచౌక్‌లో గల అంబేడ్కర్ విగ్రహం వద్ద రైతు సంఘం నాయకులతో కలిసి నిరసన కార్యక్రమం చేపట్టారు. విత్తన బిల్లులు, విద్యుత్ బిల్లుల ప్రతులను దగ్ధం చేసి నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా రెడ్డిపల్లి అప్పలరాజు మాట్లాడుతూ విత్తనాల బిల్లులపై రైతులు, రైతు సంఘాలు అభిప్రాయాలు చెప్పడానికి ఆరు నెలల గడువు పెంచాలని కోరారు. నకిలీ విత్తనాలతో రైతులు నష్టపోతే రైతులకు పరిహారం అందించేలా చట్టంలో నిబంధనలను పొందుపరచాలన్నారు. విత్తన బిల్లులను నోడల్ చట్టంగా చేసి రాష్ట్రాలు స్థానిక పరిస్థితులకు అనుగుణంగా మార్చుకునే అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. నకిలీ విత్తనాల అమ్మకందారులకు జరిమానాలతో పాటు ఐదేళ్ల వ్యాపార లావాదేవీలను నిషేధించాలన్నారు. అలాగే కేంద్ర ప్రభుత్వం నూతనంగా తీసుకువచ్చిన విద్యుత్ బిల్లులను తక్షణమే ఉపసంహరించుకోవాలన్నారు. వ్యవసాయ విద్యుత్‌కు పెంచిన కరెంట్ చార్జీలను తక్షణమే తగ్గించాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి రాజానదొరబాబు, నాయకులు తాకాశి వెంకటేశ్వరరావు, వియ్యపురాజు, వైఎస్ భద్రం, కోరిబిల్లి శంకరరావు, తప్పల ఈశ్వరరావు, నరాలశెట్టి సత్యనారాయణ పాల్గొన్నారు.

డీవీఎన్ కళాశాలలో ఏయూ శతాబ్ది ఉత్సవాలు



బ్రోచర్ ఆవిష్కరించిన వీసీ రాజశేఖర్

అనకాపల్లి టౌన్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రా యూనివర్సిటీ శతాబ్ది ఉత్సవాలు సోమవారం స్థానిక దాడి వీరునాయుడు డిగ్రీ కళాశాలలో ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమానికి హాజరైన ఏయూ వీసీ జి.పి.రాజశేఖర్ జ్యోతి ప్రజ్వలన చేసి ఉత్సవాలను ప్రారంభించారు. అలాగే ఏయూ సౌజన్యంతో కళాశాలలో మూడు రోజుల పాటు జరిగే ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా అనేక కార్యక్రమాలు రూపొందించేందుకు ప్రణాళిక సిద్ధం చేశామన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఎనిమిది, తొమ్మిది, పది తరగతులు చదువుతున్న విద్యార్థులకు ఉన్నత విద్యాభ్యాసంపై అవగాహన సదస్సులు నిర్వహించనున్నట్టు చెప్పారు. డీవీఎన్ కళాశాల చైర్మన్ దాడి రత్నాకర్ మాట్లాడుతూ ఏయూ వందేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్‌కు అనకాపల్లి జిల్లాలో గల యూనివర్సిటీ అనుబంధ కళాశాలల్లోని అనకాపల్లి దాడి వీరునాయుడు కళాశాలను ఎంపిక చేసినందుకు ఏయూ యాజమాన్యానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా డీవీఎన్ కళాశాల బ్రోచర్‌ను వీసీ రాజశేఖర్ ఆవిష్కరించారు. వీసీని దాడి రత్నాకర్ సత్కరించారు. అలాగే ఏయూ డీన్ ఔట్ రీచ్ డి. లలితా భాస్కరిని కూడా ఆయన సత్కరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ కోరిబిల్లి రమేశ్, వైస్ ప్రిన్సిపాల్ ఎస్.దయామాధురి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కొణతాల ప్రజా దర్బార్‌కు స్పందన


అర్జీదారుడి సమస్య వింటున్న ఎమ్మెల్యే కొణతాల

అనకాపల్లి టౌన్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : స్థానిక గాంధీనగరం ఎస్ఆర్ శంకరన్ భవనంలో సోమవారం ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ నిర్వహించిన ప్రజా దర్బార్‌కు విశేష స్పందన లభించింది. ఉదయం పది గంటల నుంచి జీవీఎంసీ అనకాపల్లి జోన్ పరిధిలోని వివిధ శాఖల అధికారుల సమక్షంలో పలువురు ఎమ్మెల్యే కొణతాలకు అర్జీలు అందజేశారు. ఉదయం పది నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకే ప్రజాదర్బార్ నిర్వహించాలని ముందుగా నిర్ణయం తీసుకున్నప్పటికీ అర్జీదారుల సంఖ్య అధికం కావడంతో మధ్యాహ్నం మూడు గంటల వరకు సాగింది. ఈ సందర్భంగా 138 మంది వరకు అర్జీలు వచ్చాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కొణతాల మాట్లాడుతూ వినతులను తక్షణమే పరిష్కరించేందుకు అధికారులు చొరవ చూపాలని ఆదేశించారు. జీవీఎంసీ జోనల్ కార్యాలయ ఆవరణలో ఉన్న కంపోస్ట్ యార్డును కూడా వేరే ప్రాంతానికి తరలించేందుకు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జోనల్ కమిషనర్ కె. చక్రవర్తితో పాటు వివిధ విభాగాధిపతులు, కూటమి నాయకులు పీలా నాగశ్రీను, ఆళ్ల రామచంద్రరావు, తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి కరాటే పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

కశింకోట, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : జాతీయ స్థాయి కరాటే చాంపియన్‌షిప్‌లో సెయింట్ జాన్స్ విద్యార్థులు పలు పతకాలు సాధించారని స్కూల్ డైరెక్టర్ బత్తుల నోబుల్‌కుమార్ తెలిపారు. ఈ నెల 7న ఖమ్మం, తెలంగాణలో జరిగిన కరాటే పోటీల్లో తమ విద్యార్థులు ప్రతిభ కనబరిచి పలు పతకాలు సాధించారని చెప్పారు. వారిని స్కూల్ కరస్పాండెంట్ బత్తుల అనురాధ, ప్రిన్సిపాల్ రూపనంది తదితరులు అభినందించారు.

ఎస్పీ కార్యాలయానికి 66 అర్జీలు

అనకాపల్లి రూరల్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : ప్రజలు తమ సమస్యలపై పీజీఆర్ఎస్‌లో చేసుకున్న అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను ఎస్పీ తుహిన్ సిన్హా ఆదేశించారు. జిల్లా పోలీస్ కార్యాలయం సమావేశమందిరంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి పౌరులు తరలివచ్చి ఎస్పీకి వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 66 ఫిర్యాదులు అందాయన్నారు. వాటికి సకాలంలో పరిష్కారం చూపుతామన్నారు. ఆన్‌లైన్‌లోనూ ఫిర్యాదు చేయవచ్చునన్నారు. పీజీఆర్ఎస్‌లో అందిన అర్జీలను ఏడు రోజులలోపు విచారణ పూర్తి చేసి పరిష్కారం చూపాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ ఎల్. మోహనరావు, ఎస్ఐ వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

'కారుణ్య నియామకాల ద్వారా ఉద్యోగం కల్పించాలి'

అనకాపల్లి టౌన్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ రెగ్యులర్, రిటైర్‌మెంట్, మరణించిన కార్మికుల స్థానంలో ప్రభుత్వ ఉత్తర్వులను అనుసరించి వారి కుటుంబసభ్యులకు కారుణ నియామకాల్లో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని మునిసిపల్ కార్పొరేషన్ ఎంప్లాయీస్ యూనియన్ గౌరవాధ్యక్షుడు కోన లక్ష్మణ కోరారు. సోమవారం ఈ మేరకు జీవీఎంసీ జోనల్ కార్యాలయంలో కమిషనర్ కె.చక్రవర్తికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షులు యర్రంశెట్టి అప్పలరాజు, కార్యదర్శి బంగారి రవికుమార్, శివ మూర్తి, శంకరరావు, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

పదోన్నతి పొందిన హెల్త్ అసిస్టెంట్ల అభినందన సభ

అనకాపల్లి టౌన్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : స్థానిక సీఐటీయూ కార్యాలయంలో సోమవారం యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో పదోన్నతి పొందిన హెల్త్ అసిస్టెంట్ల అభినందన సభ ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏవీ నాగేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న పదోన్నతుల పాలసీ ఆధారంగా ఉమ్మడి విశాఖ జిల్లాలో 263 మంది సచివాలయ హెల్త్ సెక్రటరీలకు హెల్త్ అసిస్టెంట్లుగా పదోన్నతి రావడం అభినందనీయమన్నారు. యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు జగన్‌మోహన్, రాష్ట్ర నాయకులు చుక్కల సత్యనారాయణ, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు వీవీ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కారంకానప్పుడు సమావేశాలెందుకు?

» ప్రశ్నించిన సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు

» మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో సమస్యలపై ఏకరువు


మాట్లాడుతున్న ఎంపీపీ బోకం సూర్యకుమారి


ఉపాధి పథకం ఎంపీవోను ప్రశ్నిస్తున్న ఎంపీటీసీ సభ్యుడు శీరం అప్పలరాజు

సబ్బవరం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఏళ్ల తరబడి సమస్యలు పరిష్కారం కానప్పుడు సమావేశాలు నిర్వహించుకోవడం ఎందుకని సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు ప్రశ్నించారు. సోమవారం స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో సర్వసభ్య సమావేశాన్ని ఎంపీపీ బోకం సూర్యకుమారి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు మాట్లాడుతూ సమావేశాలతో సంవత్సరాలు, నెలలు గడిచిపోతున్నా గ్రామాల్లో సమస్యలు పరిష్కారం కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఉపాధి పథకం ఏపీవో వసంతకుమార్ పనితీరుపై సభ్యులు అసంతృప్తి వ్యక్తం చేశారు. పైడివాడఅగ్రహారం ఎంపీటీసీ సభ్యుడు శీరం అప్పలరాజు మాట్లాడుతూ తమ గ్రామంలో శ్మశాన వాటికకు గ్రావెల్ రోడ్డు కావాలని నాలుగేళ్లుగా అడుగుతున్నా పట్టించుకోలేదన్నారు. గొల్లలపాలెంలో రాయపురాజ్ చెరువులో విచ్చలవిడిగా మట్టి తవ్వుకుపోతున్నా పట్టించుకోలేదని, గ్రామంలో డంపింగ్ యార్డుకు స్థలం కేటాయించాలని పదేళ్లుగా వినతి పత్రాలు ఇస్తున్నా పట్టించుకోలేదని సర్పంచ్ మోపాడ అప్పారావు తెలిపారు. పొలాలు ఎత్తు చేసుకోవడానికి మట్టి తవ్వకానికి అనుమతించాలని కోరగా, దరఖాస్తు చేసుకోవాలని జేఈ సూచించారు.

బాటజంగాలపాలెంలో గెడ్డలు, కాలువలు అక్రమించుకుంటున్నా అధికారులు పట్టించుకోలేదని సర్పంచ్ పడాల వెంకటరణ ఆరోపించారు. పలు గ్రామాల్లో రోడ్లు అధ్వానంగా ఉన్నాయని, బాగు చేయాలని సభ్యులు కోరారు. మార్చి నాటికి రోడ్లు బాగు చేస్తామని జేఈ బాలరాజు తెలిపారు. పాతరోడ్డు-గుల్లేరోడ్డులో ఉన్న శిథిల వంతెనకు నిధులు మంజూరయ్యేలా అధికారుల దృష్టికి తీసుకువెళ్లాలని ఎంపీపీ కోరారు. ఉపాధి పథకం పనులు ఏ గ్రామంలోనూ సరిగ్గా జరగలేదని అనకపల్లి సర్పంచ్ కర్రి నర్సింగరావు, ఆరిపాక సర్పంచ్ పాలిశెట్టి పార్వతి, అమృతపురం సర్పంచ్ బైలపూడి గౌరీ, బాటజంగాలపాలెం సర్పంచ్ పడాల వెంకటరమణ, నారపాడు సర్పంచ్ మామిడి శంకరరావు ఏపీఎంపై ధ్వజమెత్తారు. వైసీపీ ప్రభుత్వంలో ఏర్పాటు చేసిన మహిళా మార్టు ఎందుకు మూతపడిందని సభ్యులు ప్రశ్నించగా, మొదటి నుంచి నష్టాల్లో నడుస్తున్నందున ఉన్నతాధికారులు పరిశీలించి మూసేశారని ఏపీవో శ్రీనివాసరావు సభకు వివరించారు. అదే విధంగా వ్యవసాయ, విద్యుత్, వైద్య, విద్య, తదితర శాఖలపై సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీవో పి.పద్మజ, ఏవో పీవీ పంతులు, డిప్యూటీ తహశీల్దార్ సీహెచ్ అప్పారావు, వైస్ ఎంపీపీలు జాన్సీలక్ష్మీరాణి, మామిడి లక్ష్మి, పలువురు ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, అధికారులు పాల్గొన్నారు.

బాల్య వివాహ రహిత జిల్లాయే ధ్యేయం


పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ విజయకృష్ణన్, తదితరులు

» కలెక్టర్ విజయకృష్ణన్

అనకాపల్లి కలెక్టరేట్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : అన్ని శాఖల అధికారుల సహకారంతో బాల్య వివాహ రహిత జిల్లాగా తీర్చిదిద్దడమే ధ్యేయంగా పని చేస్తున్నామని కలెక్టర్ విజయకృష్ణన్ అన్నారు. బాల్య వివాహ్ ముక్త్ భారత్ కార్యక్రమ పోస్టర్‌ను ఆమె కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లా మహిళాభివృద్ధి, శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు జిల్లా స్థాయిలో 'బాల్య వివాహ్ ముక్త్ భారత్' 100 రోజుల కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. దీనిలో భాగంగా తొలి విడత ప్రభుత్వ ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలలు, రెండవ విడతగా హిందూ, ముస్లిం, క్రిస్టియన్ మత పెద్దలతో, మూడవ విడతలో గ్రామస్థాయి నాయకులు, సంబంధిత శాఖ సిబ్బందితో వచ్చే నెల 8వ తేదీ వరకు కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ప్రతి పాఠశాలలో బాల్య వివాహ రహిత భారతదేశం కోసం ప్రతిజ్ఞ చేయిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌వో వై.సత్యనారాయణరావు, జిల్లా మహిళా, శిశు సంక్షేమ సాధికార అధికారి ఎన్.సూర్యలక్ష్మి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ హైమావతి, జిల్లా బాలల సంరక్షణ అధికారి రమేశ్, తదితరులు పాల్గొన్నారు.

గొబ్బూరు గ్రామస్థుల రిలే దీక్ష

» రామ్‌కో సిమెంట్ కంపెనీ అక్రమాలను అరికట్టాలని డిమాండ్


రిలే నిరాహార దీక్షలు చేస్తున్న గొబ్బూరు గ్రామస్థులు

కశింకోట, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గొబ్బూరు గ్రామంలో ఉన్న రామ్‌కో సిమెంట్ అక్రమాలను అరికట్టాలని డిమాండ్ చేస్తూ గ్రామస్థులు సోమవారం రిలే నిరాహార దీక్ష చేశారు. ఫ్యాక్టరీ ఎదుట టెంటు వేసి ఏర్పాటు చేసి బైఠాయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఫ్యాక్టరీ ప్రారంభమై సుమారు 12 ఏళ్లు అవుతున్నా గ్రామస్థులకు పర్మినెంట్ ఉద్యోగాలు ఇవ్వలేదన్నారు. భూములిచ్చిన రైతులకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తానని చెప్పి ఏళ్లు గడుస్తున్నా స్థానికులకు అవకాశం కల్పించకుండా తమిళనాడు, తదితర రాష్ట్రాలకు చెందిన వారికి ఉద్యోగాలు ఇస్తున్నారని మండిపడ్డారు. ఫ్యాక్టరీ విస్తరణలో భాగంగా ప్రభుత్వ భూములు, కాలువలు, చెరువులను కబ్జా చేసి పనులు చేస్తున్నారని, తక్షణమే వాటిని తొలగించి ప్రభుత్వ భూములను కాపాడాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు బుద్ద రమణ, మళ్ల గణేశ్, సత్తిబాబు, సన్యాసినాయుడు, కోలా నాగేశ్వరరావు, కోన నాగేశ్వరరావు, యర్రంశెట్టి శ్రీనివాసరావు, జనపరెడ్డి మధుసూదనరావు, సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఎస్‌సీ మోడల్ టెస్ట్ పేపర్లు ఆవిష్కరణ


యూటీఎఫ్ ఎస్ఎస్‌సీ మోడల్ టెస్ట్ పేపర్లు ఆవిష్కరించిన డీఈవో

అనకాపల్లి టౌన్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : యూటీఎఫ్ రాష్ట్ర ప్రచురణల విభాగం తయారు చేసిన పదో తరగతి మోడల్ టెస్ట్ పేపర్లను సోమవారం జిల్లా విద్యాశాఖాధికారి గిడ్డి అప్పారావునాయుడు తన కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా యూటీఎఫ్ జిల్లా ప్రధానకార్యదర్శి గొంది చినబ్బాయి మాట్లాడుతూ ప్రతి ఏటా పదో తరగతి పరీక్షలకు ముందు విడుదల చేస్తున్న యూటీఎఫ్ ఎస్ఎస్‌సీ మోడల్ పేపర్లు విద్యార్థులకు మార్కులు సాధించడంలో ఎంతగానో ఉపయోగపడుతున్నాయన్నారు. డీఈవో అప్పారావునాయుడు మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యలు, విద్యారంగ సమస్యలతో పాటు విద్యార్థుల భవిష్యత్తు కోసం యూటీఎఫ్ కృషి చేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా సహ అధ్యక్షులు రొంగలి అక్కునాయుడు, జిల్లా కార్యదర్శి గుత్తుల సూర్యప్రకాశ్, ఉప్పాడ రాము, వైరాల రమేశ్‌రావు, మామిడి బాబురావు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి హాకీ పోటీలకు కౌశిక్ ఎంపిక


కౌశిక్

అనకాపల్లి టౌన్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): కడప జిల్లా పులివెందులలో ఈ నెల 9 నుంచి 12వ తేదీ వరకు జరిగే రాష్ట్రస్థాయి అండర్ -17 హాకీ పోటీలకు స్థానిక మెయిన్‌రోడ్డులోని జీవీఎంసీ ఉన్నత పాఠశాల క్రీడాకారుడు కౌశిక్ ఎంపికయ్యాడని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బ్రహ్మాజీ తెలిపారు. ఉమ్మడి విశాఖ జిల్లా తరఫున కౌశిక్ ఈ పోటీల్లో పాల్గొంటున్నట్టు తెలిపారు. కౌశిక్‌ను హెచ్ఎం బ్రహ్మాజీ, వ్యాయామ ఉపాధ్యాయుడు ఎస్.వి.నరసింహం అభినందించారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు


కోవ్వాడ అప్పారావు (ఫైల్ ఫొటో)

కశింకోట, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బయ్యవరం గ్రామానికి చెందిన ఒక వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు చేశామని ఎస్ఐ మనోజ్‌కుమార్ సోమవారం తెలిపారు. ఈ సంఘటనకు సంబంధించి ఆయన తెలిపిన వివరాలివి. బయ్యవరం గ్రామానికి చెందిన కోవ్వాడ అప్పారావు గత నెల 26న పంట పొలాలకు వెళ్లి వస్తానని చెప్పి ఇంటి నుంచి వెళ్లాడు. అయితే అప్పటి నుంచి ఇంటికి రాకపోవడంతో బంధువులు, స్నేహితుల ఇళ్లల్లో వెతికినా ఆచూకీ లభించకపోవడంతో అతని కుమారుడు సత్తిబాబు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఆయన ఆచూకీ ఎవరికైనా తెలిస్తే పోలీసుస్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని ఎస్ఐ కోరారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

అనకాపల్లి టౌన్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారిలోని పూడిమడకకు వెళ్లే జంక్షన్‌లోని వంతెన కింద గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్టు పట్టణ హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాసరావు తెలిపారు. మృతుని వయస్సు సుమారు 60 ఏళ్లు ఉంటుందని, శరీరంపై సరైన దుస్తులు కూడా లేవని తెలిపారు. ఈ మేరకు మృతదేహాన్ని ఎన్టీఆర్ వైద్యాలయంలోని మార్చురీకి తరలించామని ఆయన తెలిపారు.

పూరిల్లు దగ్ధం : రూ 3 లక్షల ఆస్తి నష్టం

కొయ్యూరు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): పాత బాలారం గ్రామంలో సోమవారం మధ్యాహ్నం విద్యుత్ షార్టు సర్క్యూట్ కారణంగా జరిగిన అగ్నిప్రమాదంలో విజ్జపు కొండబాబుకు చెందిన పూరిల్లు దగ్ధమై సుమారు రూ. 3 లక్షల ఆస్తి నష్టం వాటిల్లింది. కొండబాబు కుటుంబం వ్యవసాయ పనులకు పొలాలకు వెళ్లిపోవడంతో ఇంటి నుంచి మంటలు చెలరేగాయి. ఈ ఘటన సమయానికి ఎవరూ ఇంటి వద్ద లేకపోవడంతో గృహోపకరణాలు, తిండి గింజలు, బట్టలు, తదితర సామగ్రి కాలిబూడిదయ్యాయి. గ్రామస్థులు మంటలను అదుపు చేయడంతో గ్రామానికి పెనుముప్పు తప్పింది. ఈ ఘటనతో కొండబాబు కుటుంబం కట్టుబట్టలతో మిగిలారు. నష్టాన్ని అంచనా వేసి తగినసాయం అందించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

గిరిజన రైతులకు వర్మీ కంపోస్టు పిట్స్

జి.మాడుగుల, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : ఆర్గానిక్ పద్ధతిలో సాగు చేపడుతున్న గిరిజన రైతులకు ప్రోత్సాహంగా వర్మీ కంపోస్టు పిట్స్ అందిస్తున్నట్టు మత్స్యదేవత ఎఫ్‌పీవో సీఈవో ఐసారం హనుమంతరావు తెలిపారు. మండలంలోని సోమవారం వంతాల పంచాయతీ చింతగొంది గ్రామంలో వర్మీ కంపోస్టుపై అవగాహన కల్పించారు. సీఎస్‌ఎం అరుణ మాట్లాడుతూ..రసాయన ఎరువులు వాడకుండా పూర్వ పద్ధతుల్లో వ్యవసాయం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎఫ్‌పీవో సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

సమయపాలన పాటించకుంటే చర్యలు



రేవళ్ల సచివాలయంలో రికార్డులు తనిఖీ చేస్తున్న డిప్యూటీ ఎంపీడీవో

కొయ్యూరు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): సచివాలయ సిబ్బంది సమయ పాలన పాటించకుంటే చర్యలు తప్పవని డిప్యూటీ ఎంపీడీవో శ్రీనివాసరావు హెచ్చరించారు. సోమవారం ఆయన కొయ్యూరు, రేవళ్ల సచివాలయాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా హాజరు, మూమెంట్ రిజిస్టరులను పరిశీలించారు. సిబ్బంది సమయ పాలన పాటిస్తూ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు అర్హులందరికీ సకాలంలో అందించేలా చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట ఈవోపీఆర్‌డీ నాయుడు ఉన్నారు.

'టీడబ్ల్యూ టీచర్లకు వెంటనే జీతాలు చెల్లించాలి'



విలేకరులతో మాట్లాడుతున్న పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు యూవీగిరి

చింతపల్లి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి):గిరిజన సంక్షేమ శాఖ ఉపాధ్యాయులు, హెచ్‌డబ్ల్యూవోలకు వెంటనే జీతాలు చెల్లించాలని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు యూవీ గిరి అన్నారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. డిసెంబరు నెల జీతం ప్రభుత్వ, జిల్లా పరిషత్ ఉపాధ్యాయులకు ఒకటో తేదీన జమ అయ్యాయన్నారు. గిరిజన సంక్షేమ శాఖ ఉపాధ్యాయులకు ఎనిమిదో తేదీ వరకు వేతనాలు జమకాలేదన్నారు. ఉద్యోగులకు ప్రతి నెల చెల్లించాల్సిన ఈఎంఐలు ఉంటాయన్నారు. బ్యాంక్ రుణాలు మూడు, ఐదో తేదీ లోపు చెల్లించాల్సి వుందన్నారు. గిరిజన సంక్షేమ శాఖ ఉన్నతాధికారులు స్పందించి ప్రతి నెల ఒకటో తేదీన జీతాలు జమ చేసే విధంగా ఏర్పాట్లు చేయాలన్నారు. సమావేశంలో వివిధ ఉపాధ్యాయ సంఘాల నాయకులు కె. దేముళ్ల నాయుడు, గసాడి పద్మనాభం, బొడ్డు గంగరాజు, పాతుని రామరాజు, కంకిపాటి రామకృష్ణ పాల్గొన్నారు.

సీపీఎస్‌ను రద్దు చేయాలని జేసీకి వినతి



జేసీ శ్రీపూజకు వినతిపత్రం అందిస్తున్న సీపీఎస్ ఉద్యోగుల సంఘ నేతలు

పాడేరురూరల్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): సీపీఎస్‌ను రద్దు కోరుతూ సంఘం నాయకులు సోమవారం ఇన్‌చార్జి జేసీ తిరుమణి శ్రీపూజకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర గడుస్తున్నా సీపీఎస్ ఉద్యోగులకు ఇచ్చిన హామీ నెరవేరలేదన్నారు. అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే పరిష్కరిస్తామని ఇచ్చిన హామీ ఒట్టిమాటేనా అని ప్రశ్నించారు. పీఆర్‌సీ, డీఏ, సీపీఎస్ గాలికి వదిలి తీవ్ర పని ఒత్తిడిలో ఉండేలా చేశారన్నారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు బాజీ పఠాన్, కరిమి రాజేశ్వరరావు, చీర్ల కిరణ్, ఉమామహేష్, జిల్లా అధ్యక్షుడు ఎం.ఈశ్వరరావు, రాష్ట్ర కౌన్సిలర్ కె.రమేష్, అనకాపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణమోహన్ పాల్గొన్నారు.

సీఐటీయూ మహాసభలు విజయవంతం చేయాలి

చింతపల్లి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి):సీఐటీయూ అఖిల భారత 18వ మహాసభలు విజయవంతం చేయాలని జిల్లా అధ్యక్షుడు బోనంగి చిన్నయ్య పడాల్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో ఈనెల 31 నుంచి జనవరి 4 వరకు జరిగే మహాసభ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈసందర్భంగా సీఐటీయూ చిన్నయ్య పడాల్ మాట్లాడుతూ కార్మిక హక్కులు, చట్టాలు పరిరక్షణకు సంఘటితంగా పోరాడాల్సిన అవసరం ఉందన్నారు. ఈకార్యక్రమంలో కార్మిక సంఘాల నాయకులు ఈశ్వరరావు, రాములమ్మ, చంటిబాబు పాల్గొన్నారు.

జోరుగా ప్రైవేటు వాహనాల తనిఖీలు

పాడేరురూరల్, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): ప్రైవేటు వాహనాల స్పీడుకు కళ్లెం వేసేందుకు విస్తృతంగా వాహన తనిఖీలను చేపట్టి కేసులు నమోదు చేస్తున్నామని ఎస్ఐ ఎల్.సురేష్ తెలిపారు. పాడేరు - అరకు ప్రధాన రహదారిపై ప్రైవేటు వాహనదారులు పరిమితికి మించి శరవేగంగా వాహనాలను నడపడంతో రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. ప్రైవేటు జీపుల్లో పరిమితికి మించి ప్రయాణికులను తరలించం, లగేజీలు అధిక మొత్తంలో తరలించడం చేస్తున్నారన్నారు. సోమవారం చింతలవీధి మూడు రోడ్ల జంక్షన్‌లో వాహన తనిఖీలను చేపట్టి ఐదు జీపుల యజమానులపై కేసులు నమోదు చేశామన్నారు. ద్విచక్రవాహనదారులు విధిగా హెల్మెట్ ధరించాలని, వాహన రికార్డులు దగ్గర ఉంచుకోవాలని ఆయన సూచించారు.

పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

పాడేరురూరల్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): గిరిజన సంక్షేమానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎన్ఎస్ఎస్ జిల్లా నోడల్ ఆఫీసర్ జి.గౌరీశంకరరావు కోరారు. లగిశపల్లి దత్తత గ్రామంలో 6వ రోజు ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రత్యేక శిబిరంలో ఆయన ప్రభుత్వ పథకాలను వివరించారు. అనంతరం కేజీబీవీ పాఠశాలలో బాల్య వివాహాలపై బాలికలకు అవగాహన కల్పించారు. తర్వాత బాలికలతో బాల్య వివాహాలను అరికట్టాలని ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో న్యాయవాది టి.ప్రసాద్ నాయుడు, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా వైస్ చైర్మన్ ఎస్.గంగరాజు, కేజీబీవీ ప్రిన్సిపాల్ ఎన్.చంద్రకళ, వైస్‌ప్రిన్సిపాల్ కె.ప్రమీల, ఎన్ఎస్ఎస్ పీవోలు రాధాకుమారి పాల్గొన్నారు.

ఏవోబీలో పోలీసుల విస్తృత తనిఖీలు

- ఛత్తీస్‌గఢ్‌లో కాంట్రాక్టర్‌ను హత్య చేసిన మావోయిస్టులు
- నిఘా వర్గాల హెచ్చరికలతో అప్రమత్తమైన పోలీసులు



సీలేరులో రామాలయం సెంటర్ వద్ద వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

సీలేరు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): జీకేవీధి మండలం సీలేరులో సోమవారం పోలీసులు విస్తృతంగా వాహనాల తనిఖీలు నిర్వహించారు. మావోయిస్టుల పీఎల్‌జీఏ వారోత్సవాలు సోమవారం ముగుస్తున్న తరుణంలో ఛత్తీస్‌గఢ్ బీజాపూర్ జిల్లాలో హిడ్మా ఆచూకీని పోలీసులకు తెలిపిన కాంట్రాక్టర్ అలీని గొంతు కోసి హత్య చేశారు. ఈ సంఘటనతో పోలీసులు అప్రమత్తమయ్యారు. మారేడిమిల్లి ఎన్‌కౌంటర్‌కు ప్రతీకార దాడులకు పాల్పడతారన్న నిఘా వర్గాల హెచ్చరికలతో సీలేరు, డొంకరాయి, మోతుగూడెం, జీకేవీధి, చింతపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో వారం రోజుల నుంచి భద్రతను కట్టుదిట్టం చేశారు. 24 గంటలు క్షుణ్ణంగా వాహనాలను తనిఖీ చేస్తున్నారు. సీలేరులో ఎస్ఐ యాసిన్ ఆధ్వర్యంలో స్థానిక రామాలయం సెంటర్, ఐటీఐ జంక్షన్, జెన్‌కో చెక్‌పోస్టుల వద్ద సీఆర్‌పీఎఫ్ బలగాలను మోహరించి సరిహద్దుల నుంచి వచ్చే పోయే వాహనాలను విస్తృతంగా చేస్తున్నారు. ఏవోబీలో పోలీసులు తనిఖీలు నిర్వహిస్తుండటంతో మారుమూల గ్రామాల గిరిజనులు పనుల మీద ఇతర ప్రాంతాలకు వెళ్లడానికి భయపడుతున్నారు.

ప్రభుత్వ ఆస్పత్రులకు 120 ఆక్సిజన్ సిలెండర్లు, 70 కాన్సన్‌ట్రేటర్లు

- కేజీహెచ్ అనస్థీషియా అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ రమేశ్



తాజంగి పీహెచ్‌సీకి అందజేసిన ఆక్సిజన్ సిలెండర్లు, కాన్సన్‌ట్రేటర్లు

చింతపల్లి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): గిరిజన ప్రాంతంలోని ప్రభుత్వ ఆస్పత్రులకు 120 ఆక్సిజన్ సిలెండర్లు, 70 కాన్సన్‌ట్రేటర్లు పంపిణీ చేశామని కేజీహెచ్ అనస్థీషియా విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ కిల్లో రమేశ్ తెలిపారు. సోమవారం తాజంగి పీహెచ్‌సీకి ఆక్సిజన్ సిలెండర్లు, కాన్సన్‌ట్రేటర్లను ఆయన అందజేశారు. ఈసందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ తన స్వగ్రామం తాజంగి కావడంతో గిరిజనులకు సకాలంలో ఆక్సిజన్ సిలెండర్లు, కాన్సన్‌ట్రేటర్లు లేక ఇబ్బందులు పడుతుండడాన్ని గుర్తించాలనన్నారు. ఈమేరకు గిరిజన ప్రాంతంలో ఆక్సిజన్ సిలెండర్లు, కాన్సన్‌ట్రేటర్లు అందజేయాలని ఓఎన్‌జీసీని కోరడంతో రూ.50లక్షల సీఎస్ఆర్ నిధుల నుంచి వీటిని సమకూర్చడం జరిగిందన్నారు. పాడేరు జిల్లా ఆస్పత్రి, చింతపల్లి ఏరియా ఆస్పత్రులకు కూడా ఆక్సిజన్ సిలెండర్లు, కాన్సన్‌ట్రేటర్లు అందజేశామన్నారు. రోగులను మైదాన ప్రాంతాలకు తరలించే సమయంలో వీటిని వినియోగించుకోవచ్చునన్నారు. ఈ సందర్భంగా ఓఎన్‌జీసీ అధికారులను ఆయన అభినందించారు.

కరుణకుమారికి దివ్యాంగుల సంఘం నేతల సన్మానం



కరుణ కుమారిని సన్మానిస్తున్న జిల్లా దివ్యాంగుల సంక్షేమ సంఘం నాయకులు

పాడేరురూరల్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): అంధుల మహిళా టీ-20 క్రికెట్ వరల్డ్ కప్‌లో పాల్గొన్న క్రికెటర్ పాంగి కరుణకుమారిని వంట్లమామిడిలో దివ్యాంగుల సంక్షేమ సంఘం నేతలు సోమవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సంక్షేమ సంఘం నేతలు మాట్లాడుతూ వంట్లమామిడికి చెందిన అంధురాలు కరుణకుమారి చిన్నవయస్సులోనే ప్రపంచ స్థాయిలో గుర్తింపు తెచ్చుకోవడం దివ్యాంగులకు గర్వంగా ఉందన్నారు. పట్టుదల ఉంటే విజయాలు సాధించేందుకు అంధత్వం అడ్డురాదని కరుణకుమారి నిరూపించిందన్నారు. కార్యక్రమంలో వంట్లమామిడి సర్పంచ్ పాంగి రాంబాబు, ఎంపీటీసీ సభ్యుడు తోకల ఈశ్వరరావు, ఆదివాసీ దివ్యాంగుల సేవా సంఘం జిల్లా నాయకులు జె.రవికుమార్, పి.కొండబాబు, కె.పండన్న, పి.చరణ్, సీహెచ్.చిట్టిబాబు, కె.రంగారావు, ఎస్.నూకరాజు, టీడీపీ అరకు పార్లమెంట్ దివ్యాంగుల సంఘం ప్రెసిడెంట్ వై.అప్పారావు పాల్గొన్నారు.

టీడీపీ నేత బొర్రా ఆర్థిక సాయం

క్రికెటర్ పాంగి కరుణకుమారికి జీసీసీ డైరెక్టర్ బొర్రా నాగరాజు సోమవారం సాయంత్రం సత్కరించి, రూ.5 వేలు ఆర్థిక సాయం అందించారు. ఆమెకు తామంతా అండగా ఉంటామన్నారు. ఈకార్యక్రమంలో తెలుగుయువత నేత బొర్రా మణికంఠరాజు ఉన్నారు.

గిరిజన విద్యార్థుల మృతిపై జ్యూడీషియల్ విచారణ జరపాలి: ఎస్ఎఫ్ఐ



ఎస్ఎఫ్ఐ జిల్లా 2వ మహాసభలు సందర్భంగా ర్యాలీ చేస్తున్న విద్యార్థులు

పాడేరురూరల్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): గిరిజన విద్యార్థుల మృతిపై జ్యూడీషియల్ విచారణ చేపట్టాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు కొర్రా కార్తీక్, కార్యదర్శి జీవన్‌కృష్ణ డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ జిల్లా 2వ మహాసభలు సందర్భంగా సోమవారం ప్రభుత్వ జూనియర్ కళాశాల నుంచి ఆర్టీసీ కాంప్లెక్స్ వరకు విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ గిరిజన ప్రాంతంలో తరచూ విద్యార్థుల మరణాలు పెరుగుతున్నాయని, వాటి నివారణకు ప్రభుత్వం తీసుకొనే చర్యలు శూన్యమన్నారు. డిగ్రీ, ఇంటర్ విద్యార్థులకు ప్రమోట్ ఫీజు రద్దు చేయాలని, ఆశ్రమాల్లో హెల్త్ అసిస్టెంట్‌లను నియమించాలని, మృతి చెందిన విద్యార్థుల కుటుంబాలకు రూ.25 లక్షల నష్ట పరిహారం అందించాలని, ఇంజనీరింగ్, డైట్, బీఈడీ, ఫార్మసీ కళాశాలలను ప్రభుత్వం ఏర్పాటు చేయాలని, స్పెషల్ డీఎస్సీ పోస్టులు భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థులు గంజాయి, డ్రగ్స్ వంటి మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని వివిధ మండలాలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు.

హెల్మెట్ ధరించండి.. రక్షణ పొందండి

పాడేరు డీఎస్పీ షేక్ షేహబాద్

వాహన చోదకులతో అవగాహన ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న డీఎస్పీ, పోలీసులు, వాహన చోదకులు

అరకులోయ, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): వాహన చోదకులు విధిగా హెల్మెట్ ధరించి రక్షణ పొందాలని పాడేరు డీఎస్పీ షేక్ షెహబాద్ అహ్మద్ అన్నారు. అరకులోయ పోలీస్ స్టేషన్ నుంచి నాలుగు రోడ్ల జంక్షన్ వరకు సోమవారం సాయంత్రం హెల్మెట్ ధరించిన వాహన దారులతో కలిసి డీఎస్పీ షెహబాద్, సీఐ హిమగిరి, ఎస్ఐలు గోపాలరావు, పాపినాయుడు, సిబ్బంది హెల్మెట్‌లు ధరించి బైక్‌లతో ర్యాలీ చేపట్టారు. ర్యాలీ అనంతరం డిఎస్పి పోలీస్ స్టేషన్ ఎదుట విలేకర్లతో మాట్లాడుతూ ద్విచక్ర వాహనాలను నడిపే వ్యక్తి, వెనుక కూర్చొన్న వారు కూడా తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. ప్రస్తుతం విపరీతమైన పొగమంచు పడుతుండడంతో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. హెల్మెట్ లేకపోవడంతో ప్రమాదాల సమయంలో తలకు పెద్ద గాయాలు కావడంతో మృత్యువాత పడుతున్నారని చెప్పారు. ప్రమాదం జరిగే సమయంలో హెల్మెట్ ఉంటే తల భాగం గాయం కాదన్నారు. అలాగే తల రోడ్డుకు డీకొట్టడంతో పెను ప్రమాదం ఏర్పడుతుందన్నారు. కొత్త వాహన చట్టాలను అనుసరించి హెల్మెట్ లేకుంటే వెయ్యి రూపాయలు జరిమాన విధిస్తామన్నారు. తాగి వాహనం నడిపినా, దురుసుగా వాహనం నడిపినా రూ.10 వేల అపరాధ రుసుము చెల్లించాల్సి ఉంటుందన్నారు. సందర్శిత ప్రాంతాలలుగా గుర్తింపు పొందిన అరకులోయ, బొర్రాగుహలు, అనంతగిరి, డుంబ్రిగుడ, కటికి, వంజంగి, మాడగడ సన్‌రైజ్‌హిల్స్, కొత్తపల్లి జలపాతం తదితర సందర్శిత ప్రాంతాలు ఉన్నందున వాహనాల రద్దీ ఎక్కువగా ఉంటుందన్నారు. ఇంటి నుంచి బయలుదేరిన వారు క్షేమంగా ఇంటికి చేరితే కుటుంబం ఆనంద పడుతుందన్నారు. కాగా, విపత్కార సమయాల్లో పోలీసులకు అవసరమైన సహాయ సహకారాలు అందించిన ఎక్స్‌కవేటర్ యజమానుల సంఘం ప్రతినిధులను సత్కరించారు. ఘాట్ రోడ్డులో తుపాన్‌లు, భారీ వర్షాల సమయంలో ఘాట్ రోడ్‌కు అడ్డంగా కొండచరియాలు జారిపడుతున్న సమయంలో క్షణాల్లో ఎక్స్‌కవేటర్‌ను తీసుకుని లైన్ క్లియరెన్స్ చేసేందుకు ఉపయోగపడుతున్నట్టు సీఐ హిమగిరి, ఎస్ఐ గోపాలరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ శ్రీనివాసరావు, హెచ్‌సీ వెంకటరావు, హోంగార్డు గురుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

క్రీడా పాఠశాలను సందర్శించిన శాప్ డైరెక్టర్



విద్యార్థులతో మాట్లాడుతున్న శాప్ డైరెక్టర్ జగదీశ్వరి... సరకులను పరిశీలిస్తున్న దృశ్యం



అరకులోయ, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): అరకులోయ గిరిజన సంక్షేమ శాఖ గురుకుల క్రీడా పాఠశాలను శాప్ డైరెక్టర్ జగదీశ్వరి సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడారు. మెనూ అమలు తీరు, సదుపాయాలపై ఆరా తీశారు. పోటీలకు వెళ్తున్న సమయంలో అవసరమైన క్రీడా సామగ్రి అందుబాటులో ఉంటుందా? లేదా? అని అడిగి తెలుసుకున్నారు. స్టోర్ రూంతో పాటు ఆఫీస్ గదిలో రికార్డులను పరిశీలించారు. ప్రాక్టీస్‌లో ఉన్న విద్యార్థులతో ముచ్చటించారు. సొంత క్రీడా పాఠశాల, వసతిగృహంతో పాటు అన్ని ఆటలకు సంబంధించిన ప్రత్యేక కోర్టులను అందుబాటులోకి తేవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ విజయనగరం జోన్ చైర్మన్ సియ్యారి దొన్నుదొర, టీడీపీ మండల అధ్యక్షుడు కిల్లో ఆనంద్, మాజీ మండల అధ్యక్షుడు శెట్టి బాబూరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలకు అడ్డుకట్ట వేయండి

- జిల్లా శిశు సంరక్షణాధికారి సిద్ధు

అనంతగిరి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలకు అడ్డుకట్ట వేయాలని జిల్లా శిశు సంరక్షణ అధికారి సిద్ధు అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద సోమవారం విద్యార్థులకు బాల్యవివాహాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాల్య వివాహాలను నివారించేలా ప్రభుత్వం వంద రోజులు కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని వివరించారు. గ్రామాల్లో బాల్యవివాహాలు జరుగుతున్నట్టు తెలిస్తే సమాచారం ఇవ్వాలని సూచించారు. బాల్య వివాహాల వల్ల రెండు జీవితాలను నాశనమవుతాయని హెచ్చరించారు. కార్యక్రమంలో సర్పంచ్ రూతు, సీడీపీవో సుగుణ, సూపర్‌వైజర్ సంతోషికుమారి, మహిళా పోలీసు సునీత పాల్గొన్నారు.

వెయిట్ లిఫ్టింగ్‌లో గిరి విద్యార్థిని ప్రతిభ

డుంబ్రిగుడ, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో గొల్లోరి లెనిన్‌ప్రియ అనే గిరిజన విద్యార్థిని ప్రతిభ కనబర్చింది. ఈ పోటీల్లో 58 కిలోల విభాగంలో రజత పథకం సాధించింది. పోతంగి పంచాయతీ బోడుగుడ గ్రామానికి చెందిన విద్యార్థిని కడప జిల్లా పుట్టంపల్లిలోని డాక్టర్ వైఎస్సార్ స్పోర్ట్స్ స్కూల్‌లో పదో తరగతి చదువుతున్నది. కేరళ రాష్ట్రం త్రిసూల్లో జరిగిన అస్మిత ఖేలో ఇండియా వెయిట్ లిఫ్టింగ్ పోటీలో రజతం సాధించింది. గిరి విద్యార్థిని ప్రతిభ పట్ల కుటుంబ సభ్యులు, గ్రామస్థుల అభినందించారు.

బూసుకొండ జూనియర్ కాలేజీలో స్వచ్ఛభారత్

సీలేరు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): సీలేరు ప్రభుత్వ జూనియర్ కాలేజీ విద్యార్థులు దుప్పులవాడ పంచాయతీ బూసుకొండ గ్రామంలో సోమవారం స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. బూసుకొండ గ్రామంలో విద్యార్థులు చెత్త,చెదారం, తుప్పలను తొలగించి శుభ్రం చేశారు. కార్యక్రమంలో దుప్పులవాడ సర్పంచ్ కె.కుమారి, ఎన్ఎస్ఎస్ పీవో డి శ్రీనివాస్ పాల్గొన్నారు.

మండల జీఎస్‌డబ్ల్యూఎస్ అధికారిగా మూర్తి



బీపీబీఎస్ మూర్తి

చింతపల్లి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండల గ్రామ, వార్డు సచివాలయాల(జీఎస్‌డబ్ల్యూఎస్) అధికారిగా బీపీబీఎస్ మూర్తి నియమితులయ్యారు. తాజాగా గ్రామ, వార్డు సచివాలయాల పర్యవేక్షణ కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక వ్యవస్థను రూపొందించిన విషయం పాఠకులకు తెలిసిందే. ఈమేరకు ఎస్.రాయవరం గ్రేడ్-1 కార్యదర్శి బీపీబీఎస్ మూర్తికి డిప్యూటీ ఎంపీడీవోగా పదోన్నతి కల్పించి ఇక్కడ జీఎస్‌డబ్ల్యూఎస్ అధికారిగా నియమించారు. సోమవారం ఆయన మండల జీఎస్‌డబ్ల్యూఎస్ అధికారిగా బాధ్యతలు స్వీకరించారు. అనంతరం చింతపల్లి, చౌడుపల్లి సచివాలయాలను ఆయన తనిఖీ చేశారు. నూతనంగా నియమితులైన జీఎస్‌డబ్ల్యూఎస్ అధికారిని సచివాలయం ఉద్యోగులు శుభాకాంక్షలు తెలిపారు.

జీకేవీధి ఎంఈవో-1గా గోవిందరావు పడాల్

గూడెంకొత్తవీధి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండల విద్యాశాఖ అధికారి-1గా దేశగిరి గోవిందరావు పడాల్ నియమితులయ్యారు. స్థానిక ఎంఈవో-1 పనిచేస్తున్న తగ్గి సత్యనారాయణ అనారోగ్య కారణంగా నెల రోజుల క్రితం స్వచ్ఛందంగా బాధ్యతల నుంచి తప్పుకున్నారు. దీంతో ఖాళీగానున్న ఎంఈవో-1గా పెదవలస ప్రభుత్వ ఉన్నత పాఠశాల స్కూల్ అసిస్టెంట్ (గణితం) గోవిందరావు పడాల్‌ని నియమిస్తూ ఆర్‌జేడీ ఉత్తర్వులు జారీ శారు. ఈమేరకు సోమవారం విధుల్లో చేరారు. గోవిందరావు పడాల్‌ని చింతపల్లి ఎంఈవో-1 పీబీవీవీ ప్రసాద్, వివిధ సంఘాల నాయకులు బొడ్డు గంగరాజు, పాతును రామరాజు పడాల్, పెద్దబ్బాయి, గెమ్మెలి మోహనరావు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

స్థానిక ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

- టీడీపీ మండలాధ్యక్షుడు పొత్తూరు కొండలరావు

గూడెంకొత్తవీధి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా కార్యకర్తలు పనిచేయాలని టీడీపీ మండలాధ్యక్షుడు పొత్తూరు కొండలరావు తెలిపారు. సోమవారం మండల కేంద్రంలో జరిగిన టీడీపీ మండల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వచ్చే ఏడాది సర్పంచ్, ఎంపీటీసీ సభ్యుల ఎన్నికలు జరగనున్నాయన్నారు. ఈ ఎన్నికలకు ఇప్పటి నుంచే సన్నద్ధం కావాలన్నారు. కార్యకర్తలు ప్రజల మధ్యలో ఉంటూ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమాన్ని తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి పసుపులేటి నాగమణి, దేవరాపల్లి సర్పంచ్ బుజ్జిబాబు, ఏఎంసీ డైరెక్టర్ మొట్టడం శరభన్నదొర పాల్గొన్నారు.

'శాస్త్రి మృతి ఆదివాసీ ఉద్యమానికి తీరని లోటు'

పాడేరురూరల్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి):ఆంధ్రప్రదేశ్ గిరిజన పరిశోధన సంస్థ డైరెక్టర్ డాక్టర్.వీఎస్‌వీకే శాస్త్రి మరణం ఆదివాసీ ఉద్యమానికి తీరని లోటని సీపీఎం జిల్లా కార్యదర్శి పి.అప్పలనర్స అన్నారు. సోమవారం హైదరాబాద్‌లో మరణించారన్న విషయం తెలుసుకున్న సీపీఎం జిల్లా నాయకులు కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా అప్పలనర్స మాట్లాడుతూ గిరిజనుల సమస్యలపై 10 రకాల పుస్తకాలను, 100 రకాల వ్యాసాలు రాసి ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చిన మహానీయుడు శాస్త్రి అన్నారు.

డీటీఎఫ్ నూతన జిల్లా కార్యవర్గం

పాడేరురూరల్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ నూతన జిల్లా కార్యవర్గం ఎన్నికలను సోమవారం స్థానిక గిరిజన ఉద్యోగుల సంఘం భవనంలో నిర్వహించామని రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎ.ధర్మేంద్రరెడ్డి తెలిపారు. ఈ ఎన్నికల్లో జిల్లా అధ్యక్షుడుగా ఎస్.గురుదొర, ఉపాధ్యక్షులుగా ఎంవీ.రమణనాయుడు, జె.సింహాచలం, వి.మాధవరావు, ప్రధాన కార్యదర్శిగా ఎం.దేవుడు, కార్యదర్శులుగా ఎం.ప్రసాదరావు, బి.రాజుబాబు, ఆడిట్ కమిటీ ప్రతినిధులుగా కె.కామేశ్వరరావు, కె.జలంధర్, రాష్ట్ర కౌన్సిలర్లుగా ముఖి రామకృష్ణ, జి.వికాశ్, జె.ఆనందరావు, పి.తిరుపతిరావు ఎంపికయ్యారన్నారు.

డిగ్రీ కళాశాలలో జాతీయ సెమినార్ రేపు

చింతపల్లి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధ, గురువారాలు డిజిటల్ ఎడ్యుకేషన్‌పై మూడో జాతీయ సెమినార్ నిర్వహించనున్నట్టు ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం. విజయభారతి తెలిపారు. సోమవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ పీఎం ఉష పథకంలోరెండు రోజుల పాటు ఈ సెమినార్ నిర్వహిస్తామన్నారు. ఈసెమినార్‌కి వరంగల్ కాకతీయ విశ్వవిద్యాలయంలో రిటైర్ అయిన ప్రొఫెసర్ డాక్టర్ శర్మ వీఎస్ వెలూరి, కర్నూల్ కేవీఆర్ ప్రభుత్వ కళాశాల గణితం అధ్యాపకులు డాక్టర్ టి. సునీత, సైకాలజీ అధ్యాపకులు డాక్టర్ పరిమళదేవి హాజరుకానున్నారన్నారు. గిరిజన యువత, విద్యార్థులు సెమినార్‌ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె తెలిపారు.

ముమ్మరంగా వరి కోతలు



ముంచంగిపుట్టులో వరి కోతలు చేపడుతున్న రైతు కూలీలు

ముంచంగిపుట్టు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలో వరి కోతలు ముమ్మరంగా జరుగుతున్నాయి. ఏ గ్రామాన్ని సందర్శించినా రైతులు వరి కోత పనుల్లో బిజీబిజీగా కనిపిస్తున్నారు. తుఫాన్ కారణంగా కొద్ది రోజులుగా వరి కోతలను నిలిపివేసిన విషయం తెలిసిందే. ప్రస్తుతం ఎండ కాయడంతో వరి కోతలపై గిరిజన రైతులు దృష్టి సారించారు. ఒక వైపు కోతలు కోస్తూనే, మరో వైపు వరి పంటను కల్లాలకు తరలిస్తున్నారు. పలు చోట్ల వరి కోతలు పూర్తి కావడంతో నూర్పులు సైతం ముమ్మరంగా చేస్తున్నారు. గత ఏడాదితో పోల్చితే ఈ ఏడాది వరి దిగుబడి ఎక్కువగా వచ్చిందని, వాతావరణం సహకరిస్తే తమ శ్రమకు ఫలితం ఉంటుందని రైతులు అంటున్నారు.

ఉత్సాహంగా గంగమ్మతల్లి ఉత్సవాలు



థింసా నృత్యాలతో సందడి చేస్తున్న గిరిజనులు

డుంబ్రిగుడ, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కమలబంద గ్రామంలో గంగమ్మతల్లి ఉత్సవాలు ఘనంగా జరిగాయి. ఏటా డిసెంబరు మొదటి వారంలో ఈ ఉత్సవాలను జరుపుకోవడం ఆనవాయితీ. అమ్మవారి జ్యోతిని గ్రామంలోకి తీసుకొచ్చి వారం రోజుల పాటు ఉంచుతారు. చుట్టు పక్కల గ్రామాల గిరిజనుల భాగస్వామ్యంతో ప్రత్యేకంగా పూజలులు చేస్తారు. గిరిజన సంప్రదాయ నృత్యాలను ఆచరిస్తూ గంగమ్మతల్లి గ్రామ దేవత పండుగను జరుపుకుంటున్నారు. మంగళవారం గంగమ్మతల్లి జాతర ముగింపు కార్యక్రమానికి ఐటీడీఏ పీవో తిరుమణి శ్రీపూజ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఉత్సవ కమిటీల సభ్యులు ఏర్పాట్లు చేశారు.


ల్యాబ్ సిబ్బందితో మాట్లాడుతున్న డీపీఎం డాక్టర్ ప్రశాంతి

ప్రైవేటు ల్యాబ్‌లలో డీపీఎం తనిఖీలు

నర్సీపట్నం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రైవేటు ల్యాబ్‌లలో వైద్య, ఆరోగ్య శాఖ జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ జె.ప్రశాంతి సోమవారం విస్తృతంగా తనిఖీలు చేశారు. మూడు ప్రైవేటు ల్యాబ్‌లలో పరికరాలు, రికార్డులను పరిశీలించారు. డీఎంహెచ్‌వో అనుమతి పత్రం ప్రదర్శించడం, నిపుణులైన సిబ్బంది ఉన్నారా? లేరా?, వారి ధ్రువీకరణ పత్రాల గురించి ఆరా తీశారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ జారీ చేసిన పత్రాలు లేకపోతే చర్యలు తప్పవని ఈ సందర్భంగా డీపీఎం హెచ్చరించారు. అలాగే ల్యాబ్‌లో పేథాలజిస్ట్ తప్పనిసరిగా ఉండాలని చెప్పారు

ముగిసిన ఎన్‌ఎస్‌ఎస్ సేవా శిబిరం



ఎన్‌ఎస్‌ఎస్ పీవో రత్నభారతిని సత్కరిస్తున్న స్థానిక ప్రజలు

చోడవరం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గాంధీ గ్రామంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ పీవో డాక్టర్ రత్నభారతి ఆధ్వర్యంలో నిర్వహించిన ఎన్‌ఎస్‌ఎస్ సేవా శిబిరం సోమవారంతో ముగిసింది. ఈ సందర్భంగా గ్రామంలో వారం రోజుల పాటు విద్యార్థులు ప్లాస్టిక్ వినియోగానికి వ్యతిరేకంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. గ్రామంలో స్వచ్ఛ భారత్ కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గాడి అప్పారావు, అధ్యాపకులు అప్పలనాయుడు, వెంకటేశ్, వాసుదేవరావు, సూర్యావతి తదితరులు పాల్గొన్నారు. అలాగే అంకుపాలెంలోఎస్ ఎస్ఎస్ పీవో బి.పిచ్చమ్మ ఆధ్వర్యంలో సేవా శిబిరం నిర్వహించారు. పరిసరాల పరిశుభ్రతతో పాటు వివిధ కార్యక్రమాలపై ప్రజలకు వలంటీర్లు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పరమేశ్వరి, ప్రిన్సిపాల్ కిరణ్‌కుమార్, అధ్యాపకులు రామలక్ష్మి, కోమలి, పాల్గొన్నారు. నరసయ్యపేటలో ఎన్‌ఎస్‌ఎస్ పీవో మాల్యాద్రి ఆధ్వర్యంలో విపత్తులనుంచి తప్పించుకునే మార్గాలపై స్థానికులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా పచ్చదనం, పర్యావరణ పరిరక్షణపై ప్రజలకు అవగాహన కల్పించారు.

పీజీఆర్‌ఎస్‌లో ఫిర్యాదుల వెల్లువ


వినతిపత్రాలను పరిశీలిస్తున్న ఎంపీడీవో చాయిసుధ

మాకవరపాలెం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పీజీఆర్‌ఎస్)లో వినతులు వెల్లువెత్తాయి. రాచపల్లి సెంటరు, కొత్తపాలెం గ్రామాలను ఒక పంచాయితీగా ఏర్పాటు చేయాలని కొత్తపాలెం గ్రామానికి చెందిన ఏకా శ్రీను, అడిగర్ల గిరిబాబు, లక్ష్మణ్‌కుమార్, అడిగర్ల రమణ ఎంపీడీవో చాయిసుధకు వినతిపత్రం అందజేశారు. అలాగే చామంతిపురంలో రైతుల సాగులో ఉన్న భూమిని లాక్కొని పంచాయతీ కొత్త భవనం ఏర్పాటు చేయడం సబబు కాదంటూ ఫిర్యాదు అందింది. మరికొన్ని గ్రామాల నుంచి పలు సమస్యలపై బాధితులు ఫిర్యాదులు చేశారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ బి.వెంకటరమణ, పంచాయతీరాజ్ జేఈ సోమశేఖర్, వ్యవసాయాధికారి డి.అప్పారావు పాల్గొన్నారు.

విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ


విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేస్తున్న జనసేన నాయకులు

మాకవరపాలెం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మాకవరపాలెం ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు జనసేన పార్టీ నర్సీపట్నం నియోజకవర్గ ఇన్‌చార్జి రాజాన సూర్యచంద్ర సోమవారం స్టడీ మెటీరియల్‌ను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ మెటీరియల్‌ను వినియోగించుకుని విద్యార్థులు ఉత్తమ ఫలితాలను సాధించాలని కోరారు. అలాగే చక్కగా చదువుకుని తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. అనంతరం రాష్ట్ర స్థాయి బేస్‌బాల్ పోటీలకు ఎంపికైన విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ జిల్లా కార్యదర్శులు అల్లాడ సురేశ్, పంచాద హరినాథ్, నమ్మి కొండలరావు తదితరులు పాల్గొన్నారు.

అసంపూర్తి రహదారితో తిప్పలు


రాళ్లు తేలిపోయి ప్రమాదకరంగా మారిన పెదమదిన రోడ్డు

బుచ్చెయ్యపేట డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కేబీ రోడ్డులో వెదుళ్లగెడ్డ వంతెన నుంచి పెదమదిన, గున్నెంపూడి మీదుగా పిల్లవానిపాలెం రహదారి ప్రమాదకరంగా మారింది. ఈ రోడ్డు నిర్మాణ పనులు అసంపూర్తిగా నిలిచిపోయాయి. రెండేళ్ల క్రితం రూ.1.84 కోట్ల వ్యయంతో అప్పటి ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ ఈ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. కాంట్రాక్టర్ కొంతవరకు పనులు చేపట్టారు. తర్వాత బిల్లులు చెల్లింపు జరగకపోవడంతో మధ్యలోనే వదిలేశారు. తారు రోడ్డును పూర్తిగా తవ్వేసి మెటల్, డస్ట్ వేశారు. క్రమేపీ డస్ట్ కొట్టుకుపోయి రాళ్లు తేలడంతో ప్రస్తుతం వాహనాలు ప్రయాణించడానికి కష్టతరంగా మారింది. ఈ మార్గంలో పెదమదిన-విశాఖ బస్సు నడుస్తోంది. భారీ వాహనం వెళ్తే, దాని వెనుక ప్రయాణం కష్టంగా మారుతోంది. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి ఈ రహదారి నిర్మాణం పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

కదంతొక్కిన సహకార ఉద్యోగులు

సమస్యలు పరిష్కరించాలని ధర్నాలు, దీక్షలు

ఉద్యోగ విరమణ వయస్సు 62 ఏళ్లకు పెంచాలని డిమాండ్

చోడవరం/నర్సీపట్నం/రావికమతం/దేవరాపల్లి/కె.కోటపాడు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): సహకార సంఘాల్లో పనిచేస్తున్న ఉద్యోగుల వివిధ సమస్యలపై సోమవారం నిరసన గళం విప్పారు. చోడవరం, నర్సీపట్నం, రావికమతం, దేవరా


చోడవరం డీసీసీబీ బ్రాంచి కార్యాలయం ఎదుట నిరాహార దీక్ష చేస్తున్న ఉద్యోగులు

పల్లి, కె.కోటపాడు తదితర మండలాల్లో ధర్నాలు, దీక్షలు చేపట్టారు. ప్రధానంగా ఉద్యోగ విరమణ వయస్సును 62 సంవత్సరాలకు పెంచాలని నినాదాలు చేశారు. చోడవరంలో పీఏసీఎస్ ఉద్యోగుల సంఘం జిల్లా నాయకుడు జి.బాబ్జి మాట్లాడుతూ దీర్ఘకాల సమస్యలపై ప్రభుత్వం స్పందించాలని డిమాండ్ చేశారు. జీవో నంబరు, వేతన సవరణ అమలయ్యేలా చూడాలన్నారు. సమస్యలు పరిష్కారమయ్యేవరకూ దశల వారీ ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకుడు చిన్నంనాయుడు, ఉద్యోగులు పాల్గొన్నారు. నర్సీపట్నం పీఏసీఎస్ ఉద్యోగుల యూనియన్ల ఐక్యవేదిక సభ్యుడు ఎం.మహేశ్వరరావు మాట్లాడుతూ ఉద్యోగులందరికీ ప్రొసిడింగ్స్ ఇచ్చి జీతభత్యాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. గ్రాట్యూటీ చట్టాన్ని పక్కాగా అమలుచేయాలన్నారు. రావికమతం మండలంలోని కొత్తకోట, చినపాచిల, రావికమతం, మేడివాడ, తురకలపూడి, పొట్టిదొరపాలెంలో సీఈవోలు


దేవరాపల్లిలో నినాదాలు చేస్తున్న సహకార సంఘ ఉద్యోగులు

గుర్రాల రఘు, కె.సత్యనారాయణ, మూర్తి, గొర్లె శ్రీనివాసరావు, డి.మహాదేముడు, ఎం.సత్యనారాయణ తదితరులు మాట్లాడుతూ సమస్యల పరిష్కరించాలన్న


నర్సీపట్నం డీసీసీబీ బ్రాంచ్ ఎదుట ధర్నా చేస్తున్న కార్యదర్శులు, సిబ్బంది

డిమాండ్‌తో దశలవారీగా ఆందోళనలు చేస్తున్నామన్నారు. రానున్న రోజుల్లో ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. రూ.5 లక్షలకు తక్కువ కాకుండా ప్రతీ ఒక్కరికి ఆరోగ్య బీమా సౌకర్యం కల్పించాలన్నారు. అనంతరం బ్రాంచ్ మేనేజర్లకు వినతిపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఐదు సహకార సంఘాల సీఈవోలు, సిబ్బంది పాల్గొన్నారు. కె.కోటపాడు మండల కేంద్రంతో పాటు చౌడువాడ, దేవరాపల్లి మండలం ములకలాపల్లి సహకార సంఘాలు సిబ్బంది ఇక్కడి డీసీసీబీ వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం అసిస్టెంట్ మేనేజర్ బి.రామప్పారావుకు వినతిపత్రం అందజేశారు. జీవో నంబరు 36 వెంటనే అమలు


కె.కోటపాడు డీసీసీబీ అసిస్టెంట్ మేనేజర్‌కు వినతిపత్రం ఇస్తున్న ఉద్యోగులు

పరిచి 2019, 2024 తాలుకు పెండింగ్‌లో ఉన్న వేతన సవరణలు చేయాలని, అప్పటి వరకు మధ్యంతర భృతి ఇవ్వాలని కోరారు. సహకార సంఘాలలో పనిచేసే ఉద్యోగులకు కూడా ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగా రిటైర్‌మెంట్ అవకాశం కల్పించాలన్నారు. అన్ని సేవలు సహకార సంఘాల ద్వారా రైతులకు అందేవిధంగా చర్యలు తీసుకోవాలని విన్నవించారు. 2019 తర్వాత విధుల్లో చేరిన ఉద్యోగులందరినీ పర్మినెంట్ చేయాలని, వారికి కూడా హెచ్‌ఆర్ పాలసీ అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో చౌడువాడ పాక్స్ కార్యదర్శి బత్తిన నారాయణమూర్తి పాల్గొన్నారు. దేవరాపల్లి మండలంలోని సహకార సంఘం ఉద్యోగులు సోమవారం ధర్నా చేశారు. సహకార సంఘం సీఈఓతో సహా సిబ్బంది పాల్గొన్నారు. జీవో నంబరు 36 వెంటనే అమలు చేయాలని, న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని, అంతవరకు పోరాటం కొనసాగిస్తామని సహకార సంఘం ఉద్యోగులు నినాదాలు చేశారు. సమస్యలు పరిష్కారమయ్యే వరకు దశల వారీగా ఉద్యమం ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో దేవరాపల్లి, ఎం.అలమండ, కలిగొట్ల సహకార సంఘం సిబ్బంది పాల్గొన్నారు.

చెరువు అన్యాక్రాంతం కాకుండా కాపాడండి

చోడవరం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్‌కు ఆనుకుని ఉన్న పాత చెరువును అన్యాక్రాంతం కాకుండా కబ్జా కోరల నుంచి కాపాడాలని జిల్లా సీపీఐ కార్యవర్గ సభ్యుడు రెడ్డిపల్లి అప్పలరాజు కోరారు. ఈ మేరకు సోమవారం అనకాపల్లిలోని పీజీఆర్‌ఎస్‌లో జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సర్వే నంబరు 83లో 39.7 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న పాత చెరువును కబ్జా చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు. దీనిలో భాగంగానే చెరువును డెబ్రిస్‌తో కప్పారని ఆరోపించారు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి చెరువు ఆక్రమణదారుల పాలుకాకుండా కాపాడాలని ఫిర్యాదులో విన్నవించారు. చెరువు ఆక్రమణకు అడ్డుకట్ట వేయని పక్షంలో ప్రభుత్వ శాఖల అధికారుల తీరుకు వ్యతిరేకంగా హైకోర్టును ఆశ్రయిస్తామని ఆయన స్పష్టం చేశారు.

ప్రభుత్వ భూములకు రక్షణ కల్పించండి

దేవరాపల్లి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని సర్వే నంబరు 281-1, 281-2లో ప్రభుత్వ భూమిని కోర్టు వివాదం తేలేవరకు రక్షణ కల్పించాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు డి.వెంకన్న డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం తహసీల్దార్ లక్ష్మీదేవికి ఫిర్యాదు చేశారు. భూములు అన్యాక్రాంతం కాకుండా, ఫలసాయాన్ని తీసుకు వెళ్లకుండా రక్షణ కల్పించాలన్నారు. ఈ భూములు ఎస్‌ఎఫ్‌ఏ రికార్డుల ప్రకారం ప్రభుత్వ భూమిగా నమోదైందని చెప్పారు. గతంలో పలుమార్లు ఫిర్యాదులు కూడా చేసుకున్నారని ఆయన చెప్పారు.

రబీకి వరి విత్తనాలు సిద్ధం

బుచ్చెయ్యపేట, డిసెంబరు 8 (ఆంధ్ర జ్యోతి): మండలంలోని రైతు సేవా కేంద్రాల్లో రబీ విత్తనాలు పంపిణీకి సిద్ధం ఉన్నాయని మండల వ్యవసాయధికారి బి.భాస్కరరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. బుచ్చెయ్యపేట. దిబ్బిడి, వడ్డాది, విజయరామరాజుపేట, మంగళాపురం, లోపూడి, గంటికోర్లం, పి.భీమవరం, పెదపూడి, గున్నెంపూడి, రాజాం, మల్లాం తదితర రైతు సేవా కేంద్రాల్లో విత్తనాలు అందుబాటులో ఉంటాయన్నారు. అలాగే మినుములు, రాగులు, పెసలు, వరి విత్తనాలు కూడా ఆయా రైతు సేవా కేంద్రాలలో పంపిణీ కోసం సిద్ధం చేశామని ఏవో తెలిపారు.

డంపింగ్ యార్డు సమస్యపై స్పందించండి

రావికమతం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో డంపింగ్ యార్డు సమస్యపై స్పందించాలని రావికమతం ఉప సర్పంచ్ గంజి మోదునాయుడు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు సోమవారం అనకాపల్లి కలెక్టరేట్‌లో జరిగిన పీజీఆర్‌ఎస్‌లో సోమవారం ఫిర్యాదు చేశారు. రావికమతంలో డంపింగ్ యార్డు లేక ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. చెత్త డంపింగ్ కోసం ప్రభుత్వం స్థలాన్ని కేటాయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ గ్రామ అధ్యక్షుడు డి.నాగరాజు, నీటి సంఘ మాజీ అధ్యక్షుడు కొశిరెడ్డి డి.నాగరాజు, మాజీ అధ్యక్షులు కొశిరెడ్డి వెంకట సత్యనారాయణ, వార్డు సభ్యుడు గంజి రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

చిత్రలేఖనంలో విద్యార్థి రోహిత్ ప్రతిభ

మాడుగుల రూరల్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మాడుగుల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆరో తరగతి విద్యార్థి పుట్టా రోహిత్ ఇటీవల చెన్నైలోని ఓ సంస్థ నిర్వహించిన చిత్రలేఖనం పోటీల్లో ప్రతిభ కనబర్చాడు. ఈ పోటీల్లో రోహిత్ గోల్డ్ మెడల్ సాధించాడు. దీంతో మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు సోమవారం పాఠశాలకు విచ్చేసి విద్యార్థి రోహిత్‌కు శాలువా కప్పి అభినందిస్తూ మరింత ప్రతిభ కనబరిచి ఉన్నత స్థానానికి చేరుకోవాలని ఆశీస్సులు అందించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కళావతి, హెచ్‌ఎం ముత్యాలనాయుడు, వైసీపీ నాయకులు, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

ట్రాఫిక్ సమస్యతో సతమతం

నిత్యం అవస్థలు పడుతున్న ప్రజలు, విద్యార్థులు

బసుల్లో డ్రైవర్ పక్కన, ఫుట్‌పాత్‌పై నిల్చొని ప్రయాణాలు

మాడుగుల, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మాడుగుల కేంద్రంలో ట్రాఫిక్ సమస్య రోజురోజుకూ జఠిలమవుతోంది. సోమ, గురువారాల్లో కనీసం పోలీసు చర్యలు లేకపోవడంతో సమస్య మరింత జఠిలమవుతోంది. విద్యార్థులు వెళ్తున్న సమయంలో అటుగా ఉన్న వ్యాపారులు లోడింగ్, అన్‌లోడింగ్ సంబంధించిన భారీ వాహనాలు రోడ్డు మధ్యలో నిలిపివేయడంతో అవస్థలు పడుతున్నారు. మాడుగుల కేంద్రంలో మూడు ప్రైవేటు పాఠశాలలు ఉన్నాయి. దీనిపై స్థానికుల నుంచి అధికారుల తీరుపై తీవ్ర విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా పోలీసులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఈ విషయమై ఎస్‌ఐ నారాయణ రావు వద్ద ప్రస్తావించగా స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తామని చెప్పారు.

ఎస్‌టీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులుగా రామిరెడ్డి, పరదేశి నియామకం



ఐవీ.రామిరెడ్డి... కె.పరదేశి

చోడవరం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఎస్‌టీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా కొత్తూరు బాలికల హైస్కూల్ హెచ్‌ఎం డాక్టర్ ఐ.వి.రామిరెడ్డి, కె.పరదేశి ఎన్నికయ్యారు. పద్మనాభం మండలంలోని రెడ్డిపల్లిలో ఆదివారం నిర్వహించిన ఉమ్మడి జిల్లా కౌన్సిల్ సమావేశంలో అనకాపల్లి జిల్లాకు నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈ కార్యవర్గానికి గౌరవ అధ్యక్షుడిగా ఆచంట రవి, ఉపాధ్యక్షులుగా కె.ఉదయ భాస్కర్, టి.రాజు, అసోసియేట్ అధ్యక్షులుగా టి.భాస్కర్, డి.భీమరాజు. డి.ప్రేమ్‌కుమార్, కార్యదర్శులుగా ఎ.సూర్యప్రకాశ్, వరహాలుదొర, సురేశ్‌కుమార్ ఎన్నికయ్యారు. కోశాధికారిగా జి.అచ్యుతరావు, మహిళా కన్వీనర్‌గా సిహెచ్.సునీత నియమితులయ్యారు. ఈ ఎన్నికలకు విజయనగరం జిల్లా ఎస్‌టీయూ అధ్యక్షుడు వై.అప్పారావు పరిశీలకుడిగా వ్యవహరించారు.

సోదరుడిపై దివ్యాంగురాలు ఫిర్యాదు

» ఇంటి నుంచి వెళ్లిపోవాలని బెదిరిస్తున్నారని ఆవేదన


పోలీసులకు ఫిర్యాదు చేయడానికి తండ్రితో కలిసి వచ్చిన దివ్యాంగురాలు లక్ష్మి

నాతవరం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): సొంత సోదరుడే ఇంటి నుంచి వెళ్లిపోవాలని బెదిరిస్తున్నాడని వల్సంపేట గ్రామానికి చెందిన దివ్యాంగురాలు బైపురెడ్డి లక్ష్మీ సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. తన తండ్రి వీరన్నకు తనతో పాటు ఇద్దరు మగ పిల్లలు ఉన్నారని, వారికి వివాహం జరిగిపోయిందని చెప్పారు. తనకు పెళ్లి కాలేదని, ప్రభుత్వం ఇచ్చే పింఛన్ డబ్బులతో తల్లిదండ్రుల వద్దనే ఉంటున్నానని తెలిపింది తన సోదరుడు బైపురెడ్డి రమణ కుటుంబ అవసరాల పేరుతో రెండు తులాల బంగారం, కొంత నగదును తన నుంచి తీసుకుని తిరిగి ఇవ్వడం లేదని, అడిగితే ఇంటి నుంచి వెళ్లిపోవాలని ఇబ్బంది పెడుతున్నాడని దివ్యాంగురాలు పోలీసు ఫిర్యాదులో పేర్కొంది. తనకు పోలీసులకు న్యాయం చేయాలని వేడుకుంది. ఆమె వెంట తండ్రి వీరన్న ఉన్నారు.

అడ్డూరులో వాకర్స్ క్లబ్ వన సమారాధన

చోడవరం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అడ్డూరు గ్రామంలో స్థానిక వాకర్స్ క్లబ్ వన సమారాధన కార్యక్రమం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా వివిధ రంగాలకు చెందిన ప్రముఖులను సత్కరించారు. క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు ఓరుగంటి రాంబాబు, జాజుల జగ్గారావు ఆధ్వర్యంలో నిర్వహించిన సమారాధన కార్యక్రమంలో క్లబ్ సభ్యులు ఉత్సాహంగా పాల్గొని సందడి చేశారు.

గుడివాడను ప్రత్యేక పంచాయతీగా ఏర్పాటుచేయాలి

చీడికాడ, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): కోనాం పంచాయతీలో ఉన్న ఎనిమిది గిరిజన గ్రామాలను విడదీసి గుడివాడ కేంద్రంగా ప్రత్యేక పంచాయతీ ఏర్పాటుచేయాలని గిరిజన సంఘాల నాయకుడు డిమాండ్ చేశారు. ఈ మేరకు అనకాపల్లి జిల్లా కేంద్రంలో సోమవారం జరిగిన పీజీఆర్‌ఎస్‌లో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల నాయకులు గాలి దయారావ్, దుక్కిదాసు, జల్లి దారకొండ, చలుగు దేముడు, లంకెల సోమరాజు మాట్లాడుతూ కోనాం పంచాయతీలో 14 గ్రామాలు ఉన్నాయన్నారు. వీటిలో ఏజెన్సీని ఆనుకొని ఉన్న గుడివాడ, జాజులపాలెం, వాకపల్లి, పనసగెడ్డ, మల్లిపాడు, చెరకుపల్లి, గొడుగుమామిడి, రెల్లలపాలెం గిరిజన గ్రామాలు అభివృద్ధి ఆమడ దూరంలో ఉన్నాయని చెప్పారు. ఈ ఎనిమిది గ్రామాలను కలిపి సుమారు 650 ఓట్లు ఉన్నాయని, వీటిని కోనాం పంచాయతీలో విడదీసి గుడివాడ కేంద్రంగా ప్రత్యేక పంచాయతీ ఏర్పాటు చేయాలని కోరారు. అలాగే గుడివాడ పంచాయతీని అలూరి సీతారామరాజు జిల్లాలోని పాడేరు మండలంలో కలపాలని వారు విన్నవించారు.

వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు

కె.కోటపాడు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు చేపడుతున్నామని చౌడువాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ రామచైతన్య తెలిపారు. మండలంలోని గొందుపాలెం గ్రామంలో సోమవారం పారిశుధ్య పనులకు చేపట్టారు. కాలువలు, మంచినీటి బోర్లు, రక్షిత నీటి ట్యాంకులు, పరిసర ప్రాంతాలను పరిశుభ్రం చేయించారు. కాలువలు వద్ద నీరు నిల్వ ఉండే చోట బ్లీచింగ్ చల్లించారు. అనంతరం డ్టార్ రామచైతన్య మాట్లాడుతూ గ్రామాలు పరిశుభ్రంగా ఉంటేనే ప్రజలు వ్యాధుల బారిన పడకుండా ఆరోగ్యంగా ఉంటారన్నారు. గ్రామాల పరిశుభ్రతతో పాటు ప్రతి ఒక్కరూ వ్యక్తిగత శుభ్రతను పాటించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి పి.అప్పలనాయుడు, ఎంపీహెచ్‌వో సన్యాసిరావు, పీహెచ్‌ఎన్ కనకవేణు, మలేరియా మండల సబ్ యూనిట్ అధికారి ఎస్‌పీ.రమణ పాల్గొన్నారు.

పీజీఆర్‌ఎస్‌లో 12 అర్జీలు

నర్సీపట్నం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): సబ్ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పీజీఆర్‌ఎస్)లో 12 అర్జీలు అందాయని కార్యాలయ సిబ్బంది తెలిపారు. ఏవో సత్యనారాయణ, తహశీల్దార్ రామారావు వినతి పత్రాలు స్వీకరించారు. నర్సీపట్నం కొత్తవీధి రోడ్డు 30 అడుగులకు విస్తరిస్తామని మునిసిపల్ అధికారులు చెప్పారని, తన స్థలం వద్ద రోడ్డు కాంట్రాక్టర్ 40 అగుడులు చేస్తున్నారని నాగులాపల్లి రామయమ్మ ఫిర్యాదు చేశారు. ప్రస్తుతం అక్కడ రోడ్డు 24 అడుగులు ఉందని, 30 అడుగులకు విస్తరణ చేస్తే రోడ్డుకిరువైపులా మూడు అడుగుల చొప్పున స్థలం తీసుకోవల్సి ఉండగా తన జిరాయతీ స్థలంలో అధికంగా కోత పెడుతున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. డ్వాక్రా మహిళలకు అభయహస్తం పథకం అమలు చేయాలని అనకాపల్లి జిల్లా డ్వాక్రా పొదుపు సంఘాల సమైక్య కార్యదర్శి కామిరెడ్డి లక్ష్మి వినతి పత్రం అందజేశారు.

ఆర్‌ఎస్‌కేల్లో ధాన్యం కొనుగోలు

మాకవరపాలెం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): రైతు సేవా కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు చేస్తున్నామని తహశీల్దార్ బి.వెంకటరమణ చెప్పారు. మండల రెవెన్యూ కార్యాలయంలో వ్యవసాయ సిబ్బందితో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది సాధారణ రకం రూ.2,369, గ్రేడ్-ఎ రకానికి రూ.2,389 చెల్లిస్తామన్నారు. రైతులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా నేరుగా అధికారులు ధాన్యం కొనుగోలు చేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి అప్పారావు, రైతు సేవా కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

అందుబాటులో అపరాల విత్తనాలు

నర్సీపట్నం అర్బన్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్ని రైతు సేవా కేంద్రాల్లో అపరాల విత్తనాలు అందుబాటులో ఉన్నాయని మార్కెట్ కమిటీ చైర్మన్ జి.వెంకటరమణ తెలిపారు. మార్కెట్ కమిటీ ఆవరణలో సోమవారం రైతులకు విత్తనాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ మినుములు, పెసర విత్తనాలు కావాల్సిన రైతులు పట్టాదారు పాసు పుస్తకాలతో వ్యవసాయ శాఖ సిబ్బందిని సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో ఏవో విజయలక్ష్మి, సిబ్బంది లెక్కల ఉష, రైతులు పాల్గొన్నారు.

అభయహస్తం పింఛన్ల కోసం ధర్నా

నర్సీపట్నం అర్బన్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): అర్హులైన డ్వాక్రా మహిళలకు అభయహస్తం పింఛన్లు మంజూరు చేయాలని సీపీఐ, రైతు సంఘం నాయకులు డిమాడ్ చేశారు. ఈ మేరకు ఆర్డీవో కార్యాలయం ఎదుట సోమవారం ధర్నా కార్యక్రమం నిర్వహించారు. సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు బాలేపల్లి వెంకటరమణ మాట్లాడుతూ 2009లో అప్పటి ప్రభుత్వం డ్వాక్రా సభ్యులకు అభయహస్తం పథకం ద్వారా పింఛన్లు అందిస్తామని ప్రకటించినట్టు చెప్పారు. ఈ హామీని అమలు చేయాలని కోరారు. అనంతరం ఆర్డీవోకు వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో పార్టీ నేతలు గంగా భవాని, కొండలరావు, లక్ష్మి, కార్యకర్తలు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన

నర్సీపట్నం అర్బన్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వేములపూడి నుంచి పెదుప్పరగూడెం వరకు రూ.60 లక్షల నాబార్డు నిధులతో రోడ్డు నిర్మాణానికి సోమవారం ఎంపీటీసీ సభ్యుడు బోళెం రాంప్రసాద్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు కృషితో ఎంతో కాలంగా ఎదురు చూస్తున్న రోడ్డుకు మోక్షం లభించిందని ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో డీఈ రుత్తల సత్యనారాయణ, స్థానిక నాయకుడు బి.రమణమూర్తి పాల్గొన్నారు.

నేడు మెగా కంటి వైద్య శిబిరం

కృష్ణాదేవిపేట, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): పాత కృష్ణాదేవిపేట సత్యసాయి మందిరం వద్ద మంగళవారం మెగా కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నట్టు సత్యసాయి సేవా సమితి నిర్వాహకులు తెలిపారు. శంకర్ ఫౌండేషన్ వైద్యులతో తనిఖీలు నిర్వహించి, అవసరమైన వారికి ఆపరేషన్లు చేయనున్నట్టు చెప్పారు. అలాగే రాయితీపై కంటి అద్దాలు ఇవ్వటం జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని గొలుగొండ, కొయ్యూరు మండలాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

చంద్రయ్యపాలెం భూముల సమస్య పరిష్కరించాలి

గొలుగొండ, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): పాత మల్లంపేట రెవెన్యూ పరిధిలోని చంద్రయ్యపాలెం గ్రామంలో భూముల సమస్య పరిష్కరించాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు డీటీ చైనులుకు సోమవారం వినతిపత్రం అందజేశారు. సీపీఐ మండల కార్యదర్శి రాధాకృష్ణ మాట్లాడుతూ ఈ గ్రామంలో భూములను 50 ఏళ్లుగా గిరిజనులు సాగు చేసుకుంటున్నారన్నారు. 1956లో గిరిజనులకు పట్టాలు మంజూరు చేశారని, ఇప్పుడు బడాబాబులను వారిని ఇబ్బందులకు గురిచేస్తున్నారని చెప్పారు. ఈ సమస్యపై అధికారులు స్పందించాలని కోరారు. కార్యక్రమంలో సాగు రైతులు పాల్గొన్నారు.

విద్యార్థినులకు ఆత్మరక్షణపై శిక్షణ

రోలుగుంట, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థినులకు ఆత్మరక్షణపై సోమవారం శిక్షణ ఇచ్చారు. బాలికల్లో భద్రత, శారీరక దృఢత్వం, ఆత్మవిశ్వాసం పెంపొందించేందుకు ఈ శిక్షణ చేపడుతున్నారు. దీనిలో భాగంగానే సోమవారం జడ్పీ పాఠశాలలో ప్రత్యేక శిక్షణ కార్యక్రమంను హెచ్‌ఎం శేషగిరిరావు ప్రారంభించారు.శిక్షకుడు మురళీ కృష్ణ ఆధ్వర్యంలో విద్యార్థినిలకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం శేషగిరిరావు మాట్లాడుతూ ఆడపిల్లలకు ఆత్మరక్షణ అవసరాన్ని దృష్టిలో పెట్టుకుని ఈ కార్యక్రమానికి డీఈఓ ప్రత్యేక శిక్షకుడిని నియమించారన్నారు. విద్యార్థునిలు అత్యవసర పరిస్థితుల్లో తమను తాము రక్షించుకునే నైపుణ్యాలను అందించడం ఈ శిక్షణ యొక్క ప్రధాన ఉద్దేశ్యమన్నారు. వారంలో రెండు రోజుల పాటు ఈ శిక్షణ ఉంటుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు నాగజ్యోతి పాల్గొన్నారు.

మొంథా సాయం చెల్లించాలి

రోలుగుంట, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ బాధితులకు తక్షణమే సాయం అందించాలని సీపీఎం నాయకుడు కె.గోవిందరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం తహశీల్దార్‌కు వినతిపత్రం అందించారు. అర్ల పంచాయతీలో లోసింగి, పెద్దగరువు పీవీటీజీ గిరిజనుల బ్యాంకు ఖాతాల వివరాలు తీసుకుని నెల రోజులైనా డబ్బులు జమ కాలేదన్నారు. అధికారులు తక్షణమే స్పందించి బాధితులకు సొమ్ము మంజూరయ్యేలా చూడాలని ఆయన కోరారు.

అంగరంగ వైభవంగా మేరీమాత ఉత్సవం

మహారాణిపేట/జ్ఞానాపురం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): దారి పొడుగునా జనం.. ఎటుచూసినా సందడి.. పాత పోస్టాఫీసు సమీపంలోని అన్ని రహదారులు కిటకిటలాడాయి. రోజ్‌హిల్ అమలోద్భవిమాత (కొండగుడి మేరీమాత) ఉత్సవం సోమవారం అంగరంగ వైభవంగా జరిగింది. ఉత్తరాంధ్ర, తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల నుంచి పెద్ద సంఖ్యలో విశ్వాసకులు ఉత్సవానికి తరలి వచ్చి రోజ్‌హిల్‌పై మేరీమాతను దర్శించుకుని మొక్కుబడులు చెల్లించుకున్నారు. మేరీమాత విగ్రహం వద్ద కొవ్వొత్తులు వెలిగించి ప్రార్థనలు చేశారు. నవంబరు 29న ప్రారంభమైన ఉత్సవాలు సోమవారం వార్షిక మహోత్సవంతో ముగిశాయి. సోమవారం వేకువన 4 గంటల నుంచి ఆరాధనలు ప్రారంభించారు. ప్రార్థన మందిరంలో ఆంగ్లం, తెలుగులో దివ్యబలిపూజ నిర్వహించారు. 7.30 గంటలకు గుహ వద్ద విశాఖ అగ్ర పీఠాధిపతి ఉడుముల బాల ఆధ్వర్యంలో తెలుగులో దివ్యపూజ నిర్వహించారు. జపమాల, స్వస్థత ప్రార్థనలు, ఆరాధనలు నిర్వహించారు. గుహ వద్ద చర్చి ఫాదర్ల సమక్షంలో ఉదయం 10 గంటలకు, సాయంత్రం 6 గంటలకు తెలుగులో దివ్య బలి పూజ జరిపించారు. ఉత్సవంలో ప్రధాన ఘట్టమైన తేరు ప్రదక్షిణ మధ్యాహ్నం 1.30 గంటలకు కొండ దిగువన ఉన్న సెయింట్ అలోసిస్ చర్చి నుంచి మేరీ మాత విగ్రహం (తేరు ప్రదక్షిణ) కొండ మీదకు ఊరేగింపుగా తీసుకొని వెళ్లారు. ఆదివారం రాత్రి నుంచే ఉత్సవాల కోసం వచ్చే భక్తులతో వీధులన్నీ కిక్కిరిశాయి. సమీప ప్రాంతాల్లోని పాఠశాలల్లో వారికి వసతి ఏర్పాట్లు చేశారు. విశ్వాసకుల కోసం ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడిపింది. కొండ దిగువన ట్రాఫిక్‌కు ఇబ్బంది లేకుండా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. కొత్తరోడ్డు, చిలకలకూడలి వరకు మాత్రమే ఆటోలను అనుమతించారు. విశ్వాసకులు కాలినడకన కొండకు చేరేందుకు పుట్‌పాత్‌లపై ఆక్రమణలు తొలగించారు. ప్రార్థన మందిరంలో స్టెల్లా మారిస్ విచారణకర్త రెవరెండ్ ఫాదర్ కె.విజయశేఖర్ ఉత్సవ ప్రాధాన్యతను వివరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన విశాఖపురి మేరీమాత ద్వైమాస పత్రిక బైబిల్ క్విజ్, బైబిల్ పదకేళీలో గెలుపొందిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. పుణ్యక్షేత్ర డైరెక్టర్ ఫాదర్ కొండాల జోసెఫ్, ఫాదర్ తోమాస్ పుల్లాట్, ఫాదర్ ఎం.విజయ్‌రాజు, ఫాదర్ ఎం.లారెన్స్, బ్రదర్ సెబాస్టియన్, బ్రదర్ పవన్ ఉత్సవ నిర్వహణ బాధ్యతలు చేపట్టారు.


పూల అలంకరణలో మేరీమాత రథం


దర్శనానికి వెళ్తున్న భక్తులు


పాతపోస్టాఫీసు ప్రాంతం నుంచి కొండగుడికి వెళ్లే మార్గంలో జనసందోహం


సంప్రదాయబద్ధంగా మేరీమాత వద్దకు వెళ్తున్న ప్రముఖులు

ఏపీ సర్వే ఉద్యోగుల సంఘం నూతన కార్యవర్గం


నూతన కార్యవర్గం సభ్యులు

అనకాపల్లి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఏపీ సర్వే ఉద్యోగుల సంఘం జిల్లా, డివిజన్ కార్యవర్గాల ఎన్నికలు సోమవారం అనకాపల్లి ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో జరిగాయి. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.చిరంజీవిరావు, జిల్లా శాఖ తాజా మాజీ అధ్యక్షుడు రావాడ త్రిమూర్తులు ఆధ్వర్యంలో కొత్త కార్యవర్గ ఎంపికలు ఏకగ్రీవంగా జరిగాయి. ఏపీ సర్వే ఉద్యోగుల సంఘం అనకాపల్లి జిల్లా అధ్యక్షుడిగా టీడీవీ ప్రసాద్ (చోడవరం మండల సర్వేయర్), ఉపాధ్యక్షుడిగా అన్సారీ, కార్యదర్శిగా కె.మహేశ్ (అచ్యుతాపురం), సహాయ కార్యదర్శిగా కొణతాల భాస్కరరావు(కశింకోట), కోశాధికారిగా లాలం అప్పారావు (సబ్బవరం), ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా జగన్నాథరావు, వి.ప్రసాద్, సాయికుమార్, మేఘన, ఎం.ఎం.కె.ఎ.నాగేశ్వరరావు, కృష్ణసాయి ఎంపికయ్యారు. డివిజన్ కమిటీ అధ్యక్షుడిగా బి.జగదీశ్, బి.వెంకటేశ్వరరావు, పి.సత్తిబాబు, ఉపాధ్యక్షులుగా పి.పవన్ అయ్యప్ప, ఎస్కే అమనుల్లా, బి.దేవి ప్రసాద్, కార్యదర్శులుగా ఎస్.భరత్ వర్మ, జి.వరుణ్‌కుమార్, ఎస్‌డీ ప్రశాంత్, సహాయ కార్యదర్శులుగా వి.వి.రమణమూర్తి, సత్యనారాయణ, శ్రీను, కోశాధికారులుగా అరవింద్, కిరణ్‌మైకేల్, లోవరాజు ఎన్నికయ్యాయి.


డేటా సెంటర్లు కాదు...ఉపాధి కల్పించే పరిశ్రమలు కావాలి

- స్టీల్‌ప్లాంట్ ప్రతిష్ఠ దిగజార్చి ప్రైవేటుకి అప్పగించేందుకు కుట్ర
- సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు


మాట్లాడుతున్న బీవీ రాఘవులు. చిత్రంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.లోకనాథం, జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు ఉన్నారు

విశాఖపట్నం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): డేటా సెంటర్లు ఎన్నివచ్చినా పెద్దగా ఉపాధి అవకాశాలు ఉండవు కాబట్టి, ఎక్కువమందికి ఉద్యోగాలు కల్పించే టెక్స్‌టైల్, ఫుడ్ ప్రాసెసింగ్, ఫుట్‌వేర్, గార్మెంట్ వంటి పరిశ్రమలను విశాఖకు తీసుకురావాల్సిన అవసరం ఉందని సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు సూచించారు. ఈనెల 31న నుంచి జరగబోయే సీఐటీయూ అఖిల భారత మహాసభల ఏర్పాట్లను పరిశీలించేందుకు విశాఖ వచ్చిన ఆయన సోమవారం పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర విభజన తర్వాత అధికారంలో వచ్చిన టీడీపీ, తర్వాత వైసీపీ, నేడు కూటమి ప్రభుత్వం కూడా సదస్సులు పెట్టి రాష్ట్రానికి పెట్టుబడులు తెస్తున్నట్టు ప్రచారం చేసుకుంటున్నాయే తప్ప, విదేశీ పెట్టుబడులు మాత్రం రావడం లేదన్నారు. దేశవ్యాప్తంగా పరిశీలిస్తే గత రెండేళ్లలో విదేశీ కంపెనీలు వెనక్కి వెళ్లిపోయాయే తప్ప, కొత్తగా ఏమీ రాలేదని తెలుస్తోందన్నారు. కబుర్లు చెప్పడం కంటే పెట్టుబడులు రాబట్టడానికి నిర్దిష్ట ప్రణాళిక తయారుచేయడంపై దృష్టిపెట్టాలని రాఘవులు సూచించారు.

స్టీల్‌ప్లాంటు ప్రతిష్ఠను దిగజార్చడం ద్వారా ప్రైవేటుకు కట్టబెట్టే కుట్ర జరుగుతోందని రాఘవులు ఆరోపించారు. నాసిరకం ముడిపదార్థాలను సరఫరా చేసి నాణ్యత తగ్గిపోయిందంటూ ఉక్కు ఉత్పత్తిని కించపరుస్తున్నారన్నారు. రూ.400 కోట్ల మేర జీతాలను బకాయి పెట్టడం ద్వారా బయటకు వెళ్లిపోవడమే మంచిదనే భావన ఉద్యోగుల్లో కల్పిస్తున్నారన్నారు. స్టీల్‌ప్లాంటు నిర్వాసితుల్లో ఇంకా ఎనిమిది వేల మందికి ఉపాధి కల్పించలేదన్నారు. సేకరించిన భూముల్లో చాలావరకు ఉపయోగించని భూములు ఉన్నందున వారికి ఉపాధి కల్పించడమో...లేదంటే వారి భూములను వెనక్కి ఇచ్చేయాలని డిమాండ్ చేశారు. దేశంలో కీలక రంగాల్లో ప్రభుత్వ నియంత్రణ ఉండాల్సిందేనని, లేనిపక్షంలో ఏం జరుగుతుందనే దానికి ఇండిగో సంక్షోభమే ఉదాహరణ అన్నారు. ఇండిగో సంక్షోభానికి పాలకవర్గం విధానాలే కారణమన్నారు. ఈ సమావేశంలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గసభ్యులు కె.లోకనాథం, జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు పాల్గొన్నారు.



ఎంపీ సీఎం రమేశ్‌కు నేతలు పరామర్శ

ఎర్రగుంట్ల, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): రైల్వే పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ చైర్మన్, అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్ తల్లి రత్నమ్మ దశ దినకర్మ వైఎస్సార్ కడప జిల్లా పోట్లదుర్తిలో సోమవారం నిర్వహించారు. కేంద్ర, రాష్ట్ర మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు భారీగా తరలివచ్చి సీఎం రమేశ్‌ను, ఆయన కుటుంబసభ్యులను పరామర్శించారు. కేంద్ర మంత్రి శ్రీనివాసవర్మ, రాష్ట్ర హోం మంత్రి అనిత, అసెంబ్లీ స్పీకర్ అయ్యన్నపాత్రుడు, మంత్రులు అచ్చెన్నాయుడు, గొట్టిపాటి రవి, అనగాని ప్రసాద్, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి తదితరులు రత్నమ్మ చిత్రపటానికి పూలవేసి నివాళులర్పించారు. రత్నమ్మ ఫొటో ఎగ్జిబిషన్‌ను ఏర్పాటు చేశారు. సీఎం రమేశ్ తల్లిదండ్రుల పెళ్లి ఫొటోలు, మరణించినంత వరకు ఉన్న జ్ఞాపకాలతో కూడిన ఫొటో ప్రదర్శనను వచ్చిన వారు ఆసక్తిగా తిలకించారు.

ఎంపీ సీఎం రమేశ్ మాతృమూర్తికి నివాళి

అనకాపల్లి: ఎంపీ సీఎం రమేశ్ మాతృమూర్తి చింతకుంట రత్నమ్మ వర్ధంతి సోమవారం కడప జిల్లా ఎర్రగట్ల మండలం పోట్లదుర్తి గ్రామంలో జరిగింది. ఈ కార్యక్రమానికి జిల్లాకు చెందిన కూటమి నేతలు పెద్ద సంఖ్యలో హాజరై రత్నమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ప్రభుత్వ విప్ గణబాబు, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, ఎమ్మెల్యేలు బండారు సత్యనారాయణమూర్తి (మాడుగుల), పంచకర్ల రమేశ్‌బాబు (పెందుర్తి), సుందరపు విజయ్‌కుమార్ (ఎలమంచిలి), కార్పొరేషన్ చైర్మన్‌లు పీలా గోవింద సత్యనారాయణ, బత్తుల తాతయ్యబాబు, మళ్ల సురేంద్ర, పీవీజీ కుమార్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు తదితరులున్నారు.

రెండు లారీలు ఢీ.. ఒకరి సజీవ దహనం

- దగ్ధమైన ఆయిల్ ట్యాంకర్.. కేసు నమోదు

బేస్తవారపేట, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): అనంతపురం-అమరావతి జాతీయ రహదారిలో సోమవారం సాయంత్రం జరిగిన ప్రమాదంలో ఆయిల్ ట్యాంకర్ దగ్ధమైంది. డ్రైవర్ క్యాబిన్‌లోనే సజీవ దహనమయ్యాడు. ఈ ఘటన ప్రకాశం జిల్లా బేస్తవారపేట మండలం పెంచికలపాడు వద్ద చోటుచేసుకుంది. విశాఖపట్నం సమీపంలోని పరవాడ నుంచి తాడిపత్రికి మడ్డి ఆయిల్‌తో వెళుతున్న ట్యాంకర్‌ను, అనంతపురం నుంచి రాజమండ్రికి టమాటాల లోడుతో వెళుతున్న లారీ ఢీకొట్టింది. టమాటాల లారీ వేగంగా వెళ్తున్న సమయంలో ఒక్కసారిగా టైర్ పగలడంతో అదుపుతప్పి ఎదురుగా వస్తున్న ట్యాంకర్‌ను ఢీకొట్టింది. దీంతో ఒక్కసారిగా మంటలు చెలరేగి ఆయిల్ ట్యాంకర్ దగ్ధమైంది. ఆ లారీ క్యాబిన్‌లో ఉన్న డ్రైవర్ విశాఖపట్నం జిల్లా దేవరపల్లి మండలానికి చెందిన పైడికొండలు దుర్గారావు(50) సజీవ దహనమయ్యాడు. టమాటాల లారీ పాక్షికంగా కాలిపోయింది. సకాలంలో అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేశారు. దుర్గారావు మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించిన పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నిర్ణీత గడువులోగా అర్జీలు పరిష్కరించాలి

- అధికారులకు కలెక్టర్ విజయకృష్ణన్ ఆదేశం
- పీజీఆర్ఎస్‌కు 288 వినతులు

అనకాపల్లి కలెక్టరేట్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : ప్రజలు అందజేసిన అర్జీలను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని అధికారులను కలెక్టర్ విజయకృష్ణన్ ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ నిర్వహించారు. కలెక్టర్ విజయకృష్ణన్‌తో పాటు డీఆర్వో వై.సత్యనారాయణరావులు పాల్గొని వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మొత్తం 288 అర్జీలు అందాయని, వాటిని ఆయా శాఖలకు పరిష్కార నిమిత్తం పంపించామన్నారు. పౌరులు తమ సమస్యల పరిష్కారానికి ఒకసారి కలెక్టరేట్ గడప తొక్కిన వారు మరోమారు అదే సమస్యతో తిరిగి రాకూడదన్నారు. ఆ దిశగా అధికారులు తక్షణ చర్యలు చేపట్టాలని ఆమె దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో సీపీవో జి.రామారావు, జిల్లా ఎక్సైజ్ అధికారి సుధీర్, రవాణాశాఖాధికారి జి.మనోహర్, తదితరులు పాల్గొన్నారు.

నిన్న కుక్కలు.. నేడు కోతులు..

... 5వ పేజీ తరువాయి

వారి ఇళ్లకు పంపించినట్టు తెలిసింది.

కాగా గత నెలలో వీధి కుక్కలు బీసీ సంక్షేమ బాలిక వసతిగృహంలోకి మూకుమ్మడిగా చొరబడి, విద్యార్థినులపై విచక్షణారహితంగా దాడి చేశారు. దీంతో సుమారు 25 మంది బాలికలకు కుక్కకాటు గాయాలయ్యాయి. వీరిలో కొంతమందికి తీవ్ర గాయాలు కావడంతో నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి తీసుకెళ్లి చికిత్స చేయించారు. కాగా హాస్టళ్లలోకి కుక్కలు, కోతులు వచ్చి దాడి చేస్తుండడంతో వసతిగృహాల్లో వుండడానికి విద్యార్థినులు భయపడుతున్నారు. తమ హాస్టల్‌లోకి కోతులు రావడం ఇదే ప్రథమం కాదని, గతంలో పలుమార్లు వచ్చి స్వైరవిహారం చేశాయని బాలికలు వాపోయారు. ఈ విషయమై వసతి గృహం మేట్రిన్ లలితను 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా.. కోతుల దాడిలో ఇద్దరు విద్యార్థినులకు చిన్నపాటి గాయాలయ్యాయని, ప్రమాదమేదీ లేదని అన్నారు.

కాగా సాంఘిక సంక్షేమ శాఖ వసతిగృహంలో బాలికలపై కోతులు దాడి చేసిన విషయం తెలుసుకున్న సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు కె.గోవిందరావు అధికారుల నిర్లక్ష్యంపై మండిపడ్డారు. ఎస్సీ, బీసీ వసతిగృహాల్లో విద్యార్థినులకు రక్షణ కరువైందని అన్నారు. కోతులు, కుక్కలు దాడులు చేసిన విషయాన్ని ఉన్నతాధికారులు తీవ్రంగా పరిగణించి బాలికల రక్షణకు తగు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

ఎల్లయ్య కాలువకు మోక్షం

... 5వ పేజీ తరువాయి

పరిధిలో పూడిక తీయకపోవడంతో మురుగునీరు కాలువ ద్వారా పంటపొలాలకు వెళ్లేది. దీంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఈ సమస్య ప్రభుత్వం దృష్టికి రావడంతో ఎల్లయ్య కాలువ అభివృద్ధికి చర్యలు చేపట్టాలని జిల్లా అధికార యంత్రాంగాన్ని ఆదేశించింది. దీంతో కలెక్టర్ విజయకృష్ణన్ డిస్ట్రిక్ట్ మినరల్ ఫండ్ (డీఎంఎఫ్) నుంచి నిధులు మంజూరు చేశారు. ఇప్పటికే టెండర్లను ఆహ్వానించారు. ఒకటి, రెండు రోజుల్లో టెండర్ ఖరారు చేసి, పనులు ప్రారంభించనున్నట్టు జల వనరుల శాఖ డీఈఈ స్వామినాయుడు తెలిపారు.

వ్యాన్ ఢీకొని యువకుడి మృతి

... 5వ పేజీ తరువాయి

వీరంతా స్వగ్రామంలోనే వున్నారు. కాగా వ్యాన్ డ్రైవర్ నిర్లక్ష్యం, అతి వేగం కారణంగానే ప్రమాదం జరిగిందని స్థానికులు చెబుతున్నారు. రోడ్డుపై నుంచి మృతదేహాన్ని పక్కకు తీసేందుకు స్థానికులు నిరాకరించడంతో సుమారు గంటపాటు ట్రాఫిక్ స్తంభించింది. పోలీసులు వచ్చి వివరాలు సేకరించిన అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అనకాపల్లి ఎన్టీఆర్ వైద్యాలయం మార్చురీకి తరలించారు. ప్రమాదానికి కారణమైన వ్యాన్ డ్రైవర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. సీఐ మల్లికార్జునరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

CLASSIFIEDS

CHANGE OF NAME

I, NAKHUDA GHOUSE MOHIDDIN (New Name), S/o Nakhuda Akbal Mohiddin Previously called Nakudu G Mohideen (Old Name), Resident of D.No. 12-3-23, Sarada Colony rendo Veedhi, M.R.O Office Back Side, Anakapalli, Anakapalli Dist., Andhra Pradesh-531001. Now changed my name from NAKUDU G MOHIDEEN (Old Name) To NAKHUDA GHOUSE MOHIDDIN (New Name). Hence forth I will be called as NAKHUDA GHOUSE MOHIDDIN (New Name) for all purpose.

DOCUMENTS LOST

I, K. NARAYANARAO, S/o. late Kolluru Santi Swarup, residing at Door No.11-8-33/2/1, Kartavya, Daspalla Hills, Visakhapatnam-530003. I have lost the following documents: (1) Original Registered Sale Deed, document No. 2101/1963, dtd: 21-09-1963. (2) Original Registered Partition Deed, document No.1602/1972 dtd: 21-03-1972 surrounding Car park area of All India Radio, Siripuram- (Behind Waltair Club East compound wall) on 06-12-2025. If found to anyone may please contact: 76748 38202

CHANGE OF NAME

★ I, PATANA DEBARAJU (Old Name) S/o. Patana Krishna Rao, R/o. : 4-75, Pedda St., Buddepupeta, Mandapalle, Srikakulam. Change my name from PATANA DEBARAJU (Old Name) to PATANA DEBRAJU (New Name) hence forth I am being Called as PATANA DEBRAJU (New Name) S/o. Patana Krishna Rao for all purposes.
AJV_264134

CHANGE OF NAME

★ I, MUMMULURI JAGANNADHM (Old Name) S/o. Mummuluri Sanyasi Naidu, R/o : Near to School, Peda Krishnarajapuram, Vepada, Vizianagaram. Change my Name from MUMMULURI JAGANNADHM (Old Name) to MUMMULURI JAGANNADHAM (New Name) hence forth I am being called as MUMMULURI JAGANNADHAM (New Name) all purposes.
AJV_264133

CHANGE OF NAME

★ I, Himaja Adusumilli, D/o Anjaneyulu Ravi, R/o No.401, Nimish Royal, Plot No.35, Doctors Colony Layout , Seethammadhara, Visakhapatnam, AP-530013 have changed my name as Himaja Ravi. AJH-33437

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడివిటి

For Advertisement Contact :
9963231176
9966165093

క్రైం... crime news

రెండు బొగ్గు లారీలు బోల్తా

- స్వల్ప గాయాలతో బయటపడిన డ్రైవర్లు


బోల్తా పడిన లారీ


రహదారికి మరో వైపు బోల్తా పడిన లారీ

పరవాడ, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): గంగవరం పోర్టు నుంచి పెదగంట్యాడ మండలంలోని హిందుజా పవర్‌ప్లాంట్‌కు బొగ్గులోడుతో బయలుదేరిన రెండు లారీలు మండలంలోని రావాడ పంచాయతీ పరిధి సోమునాయుడు పాలెం-ఎన్టీపీసీ సమీపంలో సోమవారం తెల్లవారుజామున బోల్తా పడ్డాయి. డ్రైవర్లు నిద్రమత్తులో జారుకోవడంతో అదుపుతప్పి బోల్తాపడినట్టు స్థానికులు చెబుతున్నారు. రెండు లారీలు రహదారికి ఆనుకొని ఉన్న ముళ్లపొదల్లోకి దూసుకుపోయి బోల్తా పడ్డాయి. క్రేన్ సహాయంతో లారీలను పక్కకు తీశారు. ఈ ప్రమాదంలో డ్రైవర్లు ఇద్దరూ స్వల్పగాయాలతో బయటపడ్డారు. ఈ సంఘటనపై పరవాడ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రమాదవశాత్తూ మహిళ మృతి


గగనం సత్యవతి(ఫైల్‌ఫొటో)

అనకాపల్లి టౌన్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): పట్టణ పోలీసుస్టేషన్ పరిధిలోని తుమ్మపాల గ్రామంలో అనారోగ్యంతో మంచానపడ్డ ఒక మహిళ సోమవారం అగ్నిప్రమాదానికి గురై మృతి చెందిందని, దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఏఎస్ఐ పి.సుందరమ్మ తెలిపారు. దీనికి సంబంధించి ఆమె తెలిపిన వివరాలిలా ఉన్నాయి. తుమ్మపాల గ్రామానికి చెందిన గగనం ఆనందరావు భార్య సత్యవతి (54) కొద్ది రోజులుగా తీవ్ర అనారోగ్యంతో మంచం పట్టింది. సోమవారం తెల్లవారుజామున ఐదు గంటల సమయంలో ఆనందరావు పాలు తెచ్చేందుకు బయలుదేరే ముందు దోమకాటుకు గురికాకుండా ఉండేందుకు దోమల నియంత్రణ చక్రాన్ని వెలిగించి సత్యవతి మంచం కింద పెట్టి వెళ్లాడు. కొద్దిసేపటికే సత్యవతి మంచంపై ఉన్న దుప్పటికి దోమల చక్రం అగ్ని తగిలి మంటలు వ్యాపించాయి. ఆ సమయంలో పక్కింట్లో ఉన్న లక్ష్మి అనే మహిళ మంటలను చూసి లోపలకి వెళ్లి ఆర్పేందుకు ప్రయత్నిం చింది. అంతేకాకుండా పాలకు వెళ్లిన సత్యవతి భర్త ఆనందరావుకు సమాచారం అందజేసింది. ఆయన వచ్చేసరికి తీవ్ర గాయాలతో సత్యవతి అపస్మారక స్థితిలో ఉంది. 108కు ఫోన్ చేయగా సిబ్బంది వచ్చి చూసేసరికి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. ఆనందరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఏఎస్ఐ సుందరమ్మ తెలిపారు.

చోడమాంబికా అమ్మవారి ఆలయంలో చోరీ


ఆధారాలు సేకరిస్తున్న క్లూస్‌టీం

అచ్యుతాపురం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): చోడపల్లిలో గల చోడమాంబికా అమ్మవారి ఆలయంలో ఆదివారం రాత్రి చోరీ జరిగిందని ఆలయ కమిటీ చైర్మన్ వీఎస్ నాయుడు సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. సోమవారం ఉదయం ఆలయం తెరవడానికి వచ్చేసరికి ముఖద్వారం తలుపులకు గల గడియలు గుణపంతో తొలగించి ఉన్నాయని, ఆలయంలోకి వెళ్లి చూడగా అమ్మవారి చేతిలో గల రెండు కేజీల బరువు గత వెండికత్తి, అమ్మవారికి వచ్చిన పట్టుచీరలతో పాటు రెండు హుండీలను పగులగొట్టి సొత్తును దొంగిలించుకుపోయారని ఆయన ఫిర్యాదు చేశారు. సీఐ ఆర్‌వీఎస్ఎస్ చంద్రశేఖర్ ఆలయాన్ని పరిశీలించారు. క్లూస్ టీం ఆధారాలు సేకరించింది.

లంచం కేసులో రైల్వే ఉద్యోగికి జైలు, జరిమానా

విశాఖపట్నం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): బిల్లులు చెల్లించేందుకు కాంట్రాక్టర్ నుంచి లంచం తీసుకుంటూ సీబీఐకి పట్టుబడిన రైల్వే ఉద్యోగికి రెండేళ్ల జైలుశిక్ష, రూ.20 వేలు జరిమానా విధిస్తూ సీబీఐ కోర్టు సోమవారం తీర్పు వెలువరించింది. దక్షిణ మధ్య రైల్వే గుంతకల్ సీనియర్ డివిజనల్ ఫైనాన్స్ మేనేజర్ కార్యాలయంలో చల్లా శ్రీనివాసరావు అకౌంట్స్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నారు. గుంతకల్ రైల్వే డివిజన్ పరిధిలో బెంగళూరుకు చెందిన గ్లోబల్ ఏజెన్సీ సంస్థ 2017లో కొన్ని పనులు చేపట్టింది. ఆ సంస్థ పనులు పూర్తిచేయడంతో బిల్లు కోసం దరఖాస్తు చేసుకుంది. 2017 జూలై, సెప్టెంబరు నెలలకు సంబంధించిన పనులకు రూ.30 లక్షలు బిల్లు చెల్లించాలంటే తనకు రూ.15 వేలు లంచం ఇవ్వాలని శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. అదే ఏడాది మార్చి నుంచి జూలై వరకూ చేసిన పనులకు బిల్లు ఇచ్చినప్పుడు శ్రీనివాసరావుకు లంచం ఇచ్చిన సంస్థ ప్రతినిధులు...మరోసారి ఇవ్వడం ఇష్టం లేక సీబీఐ అధికారులకు ఫిర్యాదు చేశారు. సీబీఐ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా శ్రీనివాసరావు లంచం తీసుకుంటున్నపుడు పట్టుకుని కేసు నమోదుచేసి అరెస్టు చేశారు. ఈ కేసుల్లో ఇరువర్గాల వాదోపవాదాలు విన్న తర్వాత సీబీఐ అధికారులు సమర్పించిన ఆధారాలను పరిశీలించిన కోర్టు శ్రీనివాసరావుకు జైలు శిక్ష, జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించింది.

రామాలయం పైనుంచి పడి బాలుడి మృతి


కోన దినేశ్ (ఫైల్)

దేవరాపల్లి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గర్శింగిలో రామాలయంపై ఉన్న పావురాన్ని పట్టుకోబోయి కింద పడి ఒక బాలుడు మృతి చెందాడు. ఆదివారం సాయంత్రం జరిగిన ఈ సంఘటనకు సంబంధించి ఎస్ఐ సత్యనారాయణ సోమవారం తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. తెనుగుపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న కోన దినేశ్(13) ఆదివారం గర్శింగి రామాలయంపై ఉన్న పావురాన్ని పట్టుకోబోయి కాలు జారి కింద పడ్డాడు. తలకు బలమైన గాయమై అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. గమనించిన గ్రామస్థులు 108 వాహనంలో విశాఖ కేజీహెచ్‌కి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కి తరలించారు. కోన నర్సిబాబు, లక్ష్మికి ఇద్దరు కుమారులు కాగా, దినేశ్ రెండవ సంతానం. ఆ బాలుడి మృతితో తెనుగుపూడిలో విషాద ఛాయలు అలముకున్నాయి. సోమవారం సాయంత్రం అంత్యక్రియలు జరిగాయి. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి


గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

ఎలమంచిలి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఎలమంచిలి రైల్వే స్టేషన్ సమీపంలో సోమవారం రైలు పట్టాలపై తీవ్ర గాయాలతో ఉన్న ఒక గుర్తు తెలియని వ్యక్తిని స్థానికులు గుర్తించారు. వెంటనే 108 వాహనంలో ఎలమంచిలి సీహెచ్‌సీకి తరలించారు. అయితే అతను మార్గమధ్యంలోనే మృతి చెందాడని వైద్యులు నిర్ధారించారు. అతని వివరాల తెలుసుకునేందుకు పోలీసులు ప్రయత్నిస్తున్నారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	125.00
లైవ్ ధర	145.00
విత్ స్కిన్	260.00
స్కిన్ లెస్	270.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	640
విజయనగరం	644
శ్రీకాకుళం	644